ఆంధ్రజ్యోతి



కామారెడ్డి
జిల్లా వార్తలు

మంగళవారం 4 నవంబరు 2025

ధాన్యానికి మొలకలు



మొలకలొచ్చిన ధాన్యాన్ని చూపుతున్న దృశ్యం

- కొనుగోళ్లు లేక వర్షానికి తడిసి ముద్దవుతున్న వరిధాన్యం
- త్వరగా కొనుగోలు చేయాలి: రైతులు

నాగిరెడ్డిపేట, నవంబరు3 (ఆంధ్రజ్యోతి): అకాల వర్షాలతో మండలంలోని పలు కొనుగోలు కేంద్రాల వద్ద వరి ధాన్యం తడిసి ముద్దవుతోంది. వరి ధాన్యానికి మొలకలు సైతం వస్తున్నాయని రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. మండలంలోని ఆత్మకూరు గ్రామంలోని కొనుగోలు కేంద్రం వద్ద తరలించిన ధాన్యం అకాల వర్షాలతో రోజూ తడిసిపోతోంది. ఆ ధాన్యానికి మొలకలు వచ్చిందని రైతులు విలపిస్తున్నారు. ఆత్మాకూర్ గ్రామంలో మొలకలు వచ్చిన ధాన్యాన్ని సోమవారం మాజీ జడ్పీటీసీ మనోహర్ రెడ్డి పరిశీలించారు. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు ధాన్యాన్ని ఆరబెట్టి కుప్పలు వేసి టాపర్లు కప్పి ఉంచుతున్నా, వర్షపు నీరు అడుగు భాగంలో చేరి ధాన్యం తడిసి మొలకలు వస్తున్నాయని రైతులు అంటున్నారు. మండల కేంద్రంలోని గోపాల్‌పేట్, పోచారం గ్రామాలలో తడిసిన ధాన్యానికి మొలకలు రాగా, ఆత్మాకూర్ గ్రామంలోనూ తడిసిన ధాన్యానికి మొలకలు రావడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. అధికారులు ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని రైతులు కోరుతున్నారు.



ఇంటి గృహప్రవేశ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

సంబురంగా ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశం

- జిల్లాలో పూర్తయిన మొదటి ఇందిరమ్మ ఇంటికి రిబ్బన్ కట్ చేసిన ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్ రావు
- లబ్ధిదారులకు పట్టు వస్త్రాలు అందజేత

లింగంపేట, నవంబరు3 (ఆంధ్రజ్యోతి): కామారెడ్డి జిల్లాలో మొదటి ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశం సంబురంగా సాగింది. లింగంపేట మండలం మోతెగ్రామంలో పూర్తయిన ఇందిరమ్మ ఇంటిని సోమవారం ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇంటి నిర్మాణం పూర్తిచేసిన తాళ్ల జ్యోతి, శివ్వయ్య దంపతులకు పట్టు వస్త్రాలు అందజేసి వారిని శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎల్లారెడ్డి నియోజకవర్గంలో గత 20ఏళ్లుగా ప్రభుత్వం పేదలకు ఇంటి నిర్మాణానికి సహాయం చేయకపోవడంతో పేదల సొంతింటి కల కలగానే మిగిలి పోయిందని అన్నారు. తన ఎన్నికల ప్రచారంలో పేదలు తమకు సొంతింటిని మంజూరు చేయాలని కోరారని గుర్తుచేశారు. వారికి ఇచ్చినహామీ మేరకు నియోజకవర్గంలో మొత్తం 3500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశానని చెప్పారు. ఇంటి నిర్మాణంలో ఎల్లారెడ్డి నియోజవర్గం ముందువరసలో ఉండడం ఎంతో సంతోషంగా ఉందని, ఇళ్ల నిర్మాణ పనులను వేగంగా చేయించిన అధికారులను ఆయన అభినందించారు. మోతె గ్రామానికి 34 ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయని, వాటిని 50కి పెంచాలని మాజీ జడ్పీటీసీ సంతోష్‌రెడ్డి కోరగా ఎమ్మెల్యే సనుకూలంగా స్పందించారు. మోతె తండాకు వెళ్లే రహదారి కొట్టుకుపోయిందని చెప్పడంతో వచ్చే బడ్జెట్‌లో నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు.

రూ.వంద కోట్లతో నియోజకవర్గ అభివృద్ధి

గత పాలకులు ఎల్లారెడ్డి నియోజకవర్గ అభివృద్ధిని పట్టించుకోలేదని దీంతో నియోజకవర్గం మిగతా 8వ పేజీలో..

బస్సు ప్రయాణమంటేనే ప్రయాణికులు భయపడుతున్నారు. రాష్ట్రంలో ఇటీవల చోటుచేసుకుంటున్న బస్సు ప్రమాదాలు ప్రయాణికులను బెంబెలేత్తిస్తున్నాయి. పక్షం రోజుల కిందట ఆంధ్రాలోని బెంగళూరు జాతీయ రహదారిపై జరిగిన బస్సు ప్రమాదం మరువక ముందే తెలంగాణలోని తాండూర్ రోడ్డుపై జరిగిన ప్రమాదం మరింత కలవర పెడుతోంది. గతంలో జిల్లాలోనూ ఆర్టీసీ బస్సు ప్రమాదాల్లో పలువురు మృతిచెందిన సంఘటనలు ఉన్నాయి.



భయం భయంగా..



రాజంపేటలో రోడ్డు ప్రమాదానికి గురైన ఆర్టీసీ బస్సు (ఫైల్)

బస్సు ప్రయాణం

- బెంబెలేత్తిస్తున్న ఆర్టీసీ బస్సు
- తాండూర్ ప్రమాదంతో ప్రయాణికుల్లో గుబులు
- వరుస ప్రమాదాలతో బస్సును చూస్తే జంకుతున్న పరిస్థితి
- కాలం చెల్లిన బస్సులతో పరిమితికి మించి ప్రయాణికులు
- ఉచిత ప్రయాణాలతో పెరిగిన రద్దీ
- ఒత్తిడిలో డ్రైవర్లు, కండక్టర్లు
- గతంలో జిల్లాలోనూ పలుమార్లు ప్రమాదాలు

కామారెడ్డి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గడిచిన ఏడాది కాలంలో వివిధ ప్రాంతాల్లో బస్సులు ప్రమాదాలకు గురయ్యాయి. పరిమితికి మించి ప్రయాణికులు ఎక్కుతున్నారు. ఒక్కోసారి 100మందికి పైగా ఉంటున్నారు. ప్రయాణికులు ఒకరికొకరు తోసుకుంటూ ప్రతీరోజు బస్సులో గొడవలు జరుగుతున్నాయి. దీంతో డ్రైవర్ ఏకాగ్రత దెబ్బతింటుంది. కాలంచెల్లిన బస్సులను నడపడమే ఇబ్బందికారంగా మారిన పరిస్థితి. ఓవైపు బస్సుల్లో పరిమితికి మించి ప్రయాణికులు ఎక్కడంతో డ్రైవర్లు, కండక్టర్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

జిల్లాలో 253 ఆర్టీసీ బస్సులు

జిల్లాలో కామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్సువాడ డివిజన్లు ఉన్నాయి. ఈ మూడు డివిజన్లలో ఆర్టీసీ తరపున కామారెడ్డి, బాన్సువాడ డిపోలు ఉన్నాయి. ఈరెండు డిపోల పరిధిలో మొత్తం 253 ఆర్టీసీ బస్సులు ఉండగా ఇందులో సంస్థకు సంబంధించిన 152, అద్దె బస్సులు (హైఆర్) 91 ఉన్నాయి. కామారెడ్డి డిపో పరిధిలో 137 బస్సులు ఉండగా ఆర్టీసీ బస్సులు 81, అద్దె బస్సులు 56 ఉన్నాయి. ఇందులో పల్లె వెలుగులు 99, ఎక్స్‌ప్రెస్‌లు 22, డిలక్స్‌లు 15 ఉన్నాయి. బాన్సువాడ డిపో పరిధిలో 106 బస్సులు ఉండగా ఆర్టీసీవి 71, అద్దె బస్సులు 35 ఉన్నాయి. ఇందులో పల్లెవెలుగులు 75, ఎక్స్‌ప్రెస్‌లు 15, డిలక్స్ బస్సులు 10 ఉన్నాయి. జిల్లాలోని ఆయా మండలాలు, ఆయా గ్రామాలతోపాటు నిజామాబాద్, హైదరాబాద్, సిరిసిల్లా, మిగతా 8వ పేజీలో..

ఉచిత ప్రయాణాలతో పెరిగిన రద్దీ

రాష్ట ప్రభుత్వం మహిళలకు ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణాన్ని అమలు చేసినప్పటి నుంచి ప్రయాణికుల రద్దీ రోజు రోజుకు పెరుగుతోంది. డ్రైవర్లు, కండక్టర్లు ఆర్టీసి బస్సుల్లో పర్మితికి మించి ప్రయాణికులను ఎక్కించుకుంటున్నారు. పూట్‌బోర్డుపై వేలాడుతూ కనిపిస్తున్నారు. కనీసం కాలు తీసి కాలు పెట్టే పరిస్థితి ఉండదు. దీనికి తోడు సీట్ల కోళ ఎక్కువవోతోంది. ప్రయాణికులు కూర్చునేందుకు కాదుకదా కలు పెట్టే పరిస్థితి లేక ఒకరినొక్కరు తోచుకోవడంతో గోడవలు జరుగుతున్నాయి. కిక్కిరిసిన బస్సుల్లో టికెట్లు తీయడం కండక్టరుకు కష్టంగా మారింది. డ్రైవర్ పరిస్థితి మరింత భయంకారంగా తయరవుతోంది. ప్రయాణికులు బానెట్ మీదనే కూర్చుంటున్నారు. దీంతో డ్రైవర్ల ఏక్రగ్రత దెబ్బతినడంతో ప్రమాదాలకు కరవుతున్నట్లు తెలుస్తోంది.

సీఎం క్షమాపణ చెప్పాలి

- పలుచోట్ల రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మ దహనం



8

నాడు దేహమే యంత్రం.. నేడు దేనికైనా యంత్రం



7



దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు

ప్రజావాణికి 111 దరఖాస్తులు

- వినతులను స్వీకరించిన అదనపు కలెక్టర్

కామారెడ్డిటౌన్, నవంబరు3 (ఆంధ్రజ్యోతి): కామారెడ్డి కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో 111 దరఖాస్తులు వచ్చినట్లు అదనపు కలెక్టర్ విక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లడుతూ ప్రతీ దరఖాస్తును క్షుణంగా పరిశీలించి త్వరితగతిన పరిష్కారించాలని అదనపుకలెక్టర్ విక్టర్ ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. తహసీల్దార్‌లు, శాఖాధికారులు ప్రజాసమస్యలను ప్రాధాన్యంగా తీసుకుని తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే పెండింగ్‌లో ఉన్న ఆయా శాఖలకు సంబంధించి ప్రజావాణి దరఖాస్తులపై ఆరా తీస్తూ దరఖాస్తులు పెండింగ్‌లో ఉంచకుండా సత్వరమే పరిష్కరించాలని తెలిపారు. కార్యక్రమంలో జడ్పీ సీఈవో చందర్, డిప్యూటీ కలెక్టర్ రవితేజ, ఏవో అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

గాంధారిలో సోయా కొనుగోలు కేంద్రం ప్రారంభం

గాంధారి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): గాంధారి మండల కేంద్రంలో సోయా కొనుగోలు కేంద్రాన్ని సోమవారం డీసీసీబీ డైరెక్టర్ సాయిబాబా, ఏఎంసీ చైర్మన్ పరమేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పాటు చేసిన సోయా కొనుగోలు కేంద్రాల్లోనే రైతులు తమ దిగుబడులను విక్రయించాలని అన్నారు. దళారును నమ్మి రైతులు మోసపోవద్దని సూచించారు. కార్యక్రమంలో ఏవో రాజలింగం, ఏఈవో నిఖీత, వైస్‌చైర్మన్ ఉద్దల్ సింగ్, డైరెక్టర్లు పాల్గొన్నారు.



కార్తీక దీపాలు వెలిగిస్తున్న మహిళలు

ఆరనీకుమా.. కార్తీక దీపం

- ఆలయాల్లో భక్తిశ్రద్ధలతో కార్తీక దీపోత్సవాలు

మద్నూర్, నవంబరు3 (ఆంధ్రజ్యోతి): దీపం జ్యోతి పరబ్రహ్మం.. అంటూ ఆలయాల్లో భక్తులు భక్తిశ్రద్ధలతో కార్తీక దీపోత్సవాలు కన్నుల పండువగా జరుపుకున్నారు. మండలకేంద్రంలోని కేంద్రంలోని బాలాజీ మందిరంలో చంద్రుని వెలుగుల మధ్య మిరిమిట్లు గొలిపే ఉసిరికాయలపై దీపకాంతులు దేవాలయంలో హారాలయ్యాయి. మహిళలు శైవక్షేత్రాలలో ప్రత్యేకపూజలు చేశారు. కార్తీకదీపం వెలిగించడంతో తమ జీవితంలో దీపం లాగే సుఖసంపదలు కలుగుతాయని మహిళా భక్తులు విశ్వసిస్తారు.



సమావేశంలో మాట్లాడుతున్న చిరంజీవులు

అన్ని పార్టీలకూ బీసీలపై చిన్నచూపు

- బీసీ రిజర్వేషన్ సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు చిరంజీవులు

కామారెడ్డిటౌన్, నవంబరు3 (ఆంధ్రజ్యోతి): బీసీలంటే అన్నిరాజకీయ పార్టీలకూ చిన్న చూపేనని 42శాతం బీసీ రిజర్వేషన్ సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు, రిటైర్డ్ కలెక్టర్ చిరంజీవులు అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 15న కామారెడ్డిలో బీసీ సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కాంగ్రెస్‌పార్టీ ఎన్నికలకు ముందు కామారెడ్డిలో బీసీ డిక్లరేషన్ చేసిందని, స్థానిక సంస్థల ఎన్నికల్లో 42శాతం రిజర్వేషన్లు అమలు చేస్తామని చెప్పడంతో పాటు ఇతర హామీలను కూడా ఇచ్చిందన్నారు. ఆ హామీల అమలుఎందుకు చేయలేకపోతున్నారో ఈ సదస్సు ద్వారా ప్రజలకు వివరిస్తామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా అన్నిజిల్లాలలో ఈ సదస్సులు నిర్వహిస్తామని, కొడంగల్‌లో ముగింపు సదస్సు నిర్వహిస్తామని, హైదరాబాద్‌లో భారీ బహిరంగ సభ నిర్వహిస్తామన్నారు. ప్రజల్లో చైతన్యం తెచ్చేందుకు ఈ సదస్సులు నిర్వహిస్తున్నామని తెలిపారు. రిజర్వేషన్ల అమలుతో 25వేల మంది రాజకీయాల్లోకి వస్తారని చెప్పారు. బీసీ సంఘాల ఒత్తిడి మేరకే ప్రభుత్వం కులగణన చేపట్టింది తప్ప ప్రభుత్వానికి చిత్త శుద్ధి లేదన్నారు. తమిళనాడులో ఎలా రిజర్వేషన్ అమలు చేస్తున్నారో అదే విధానాన్ని ఇక్కడ అవలంబించాలని అన్నారు. కాళేశ్వరం మీద ఆ ఘమేఘాల మీద అఖిలపక్షం చేశారని, బీసీల కోసం ఎందుకు నిర్వహించరని ప్రశ్నించారు. సమావేశంలో ఎస్సి, ఎస్టీ, బీసీ జేఏసీ చైర్మన్ విశారదన్ మహరాజ్, బీసీ పొలిటికల్ ఫ్రంట్ సాధన సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ బాలరాజ్ గౌడ్, బీసీ సమాఖ్య అధ్యక్షుడు దుర్గయ్య గౌడ్, ఇతర నాయకులు పాల్గొన్నారు.

ఆలయాలకు కార్తీక శోభ

- శివకేశవ ఆలయాల్లో భక్తుల పూజా కార్యక్రమాలు
- భక్తిశ్రద్ధలతో దీపోత్సవాలు

7

వన్యప్రాణుల గణనపై శిక్షణ

కామారెడ్డిటౌన్, నవంబరు3(ఆంధ్రజ్యోతి): పులులు, ఇతర వన్యప్రాణుల గణనపై అటవీశాఖ సిబ్బందికి కవ్వాల్, అమ్రాబాద్ పులుల అభయారణ్యాలకు చెందిన వన్యప్రాణి సంరక్షణ నిపుణులు ఎల్లం, బాపురెడ్డిలు శిక్షణ కార్యక్రమం నిర్వహించినట్లు డీఎఫ్‌ఓ నిఖిత తెలిపారు. వన్యప్రాణుల గణనను చేయాల్సిన విధానం, సాంకేతిక పద్ధతి, మెళుకువలపై శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బాన్సువాడ డివిజన్ అధికారి సునిత, రాజన్న అటవీ సర్కిల్ రేంజ్ అధికారులు రమేష్, సందీఫ్, హబీబ్, చరణ్ పాల్గొన్నారు.



శిక్షణ ఇస్తున్న నిపుణుడు

టీ మత్స్య యాప్‌లో వివరాలు నమోదుచేయాలి



వీసీలో పాల్గొన్న అధికారులు

కామారెడ్డి టౌన్, నవంబరు3 (ఆంధ్రజ్యోతి): టీ మత్స్య యాప్‌లో వివరాలు నమోదు చేయాలని అదనపు కలెక్టర్ విక్టర్ మత్స్యశాఖ అధికారులను ఆదేశించారు. సోమవారం మత్స్యశాఖ మంత్రి వాకిటి శ్రీహరి వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. వీసీలో అదనపు కలెక్టర్ చెరువులలో ఉచిత చేపపిల్లల పంపిణీ 2025-26పై అధికారులకు దిశానిర్దేశం చేశారు. జిల్లాలోని మొత్తం 805 చెరువులలో సుమారు 2.89 చేపపిల్లల పంపిణీ లక్ష్యాన్ని ఈనెల 20లోపు పూర్తిచేయాలని అధికారులకు సూచించారు. ప్రజాప్రతినిధుల సమక్షంలో చేపపిల్లల పంపిణీ ప్రక్రియ నిర్వహించాలని చెప్పారు. కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మదన్‌మోహన్, డిప్యూటీ కలెక్టర్ రవితేజ, జిల్లా మత్స్యశాఖాధికారి శ్రీపతి తదితరులు పాల్గొన్నారు.



ఇంట్లోని వస్తువులను ఎత్తుకెళ్లిన వానరం

గుంపులుగా కోతులు

ప్రజలకు వెతలు

- పట్టణంలో పదుల సంఖ్యలో కోతుల స్వైరవిహారం
- ఉదయం నుంచి సాయంత్రం వరకు కాలనీలో జనాలకు తప్పని తిప్పలు
- వానరులను తరిమి కొట్టేందుకు నానా తంటాలు
- పట్టించుకోని అధికారులు



కామారెడ్డి పట్టణంలో పలు కాలనీల్లో కోతుల స్వైరవిహారం

కామారెడ్డిరూరల్, నవంబరు3 (ఆంధ్రజ్యోతి): కామారెడ్డి పట్టణంలో ప్రజలకు కోతుల బెడద తీవ్రమవుతోంది. ప్రతీరోజు ఉదయం నుంచి సాయంత్రం వరకు తమ నివాసాల వద్ద కోతులు గుంపులుగా స్వైరవిహారం చేస్తున్నారు. వాటి చేష్టలతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. కొన్ని కోతులు ఇళ్లలోకి చొరబడి నానా హంగామా సృష్టించి తినుబండాలు, వస్తువులు ఎత్తుకెళ్తున్నాయి. ఏ కాలమైన కోతులు మాత్రం ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయని పట్టణ ప్రజలు ఆవేదన వ్యక్తం మిగతా 8వ పేజీలో..

క్రైం సమాచారం

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ముప్కాల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): బాల్కొండ మండలంలోని చిట్టాపూర్ జాతీయ రహదారి వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ తూమ్ రాజానారాయణ(40) చికిత్స పొందుతూ మృతి చెందినట్లు బాల్కొండ ఎస్సై శైలేందర్ తెలిపారు. వివరాలు.. ఆదివారం మధ్యాహ్నం 2.15 గంటలకు ఫత్తేపూర్ గ్రామంలో జరిగిన పెళ్లికి హాజరై తిరిగి చిట్టాపూర్ వస్తుండగా చిట్టాపూర్ ఎక్స్‌రోడ్ వద్ద దాటుతున్న సమయంలో నిర్మల్ వైపు నుంచి ఆర్మూర్ వెళ్తున్న కారు ఢీ కొంది. దీంతో రాజానారాయణ తీవ్రగాయాలు కాగా చికిత్స నిమిత్తం ఆర్మూర్‌లోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ రాత్రి మృతి చెందినట్లు తెలిపారు. మృతుని భార్య నవిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శైలేందర్ తెలిపారు.

వీడని మహిళల హత్య మిస్టరీ

నవీపేట, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలో వారం వ్యవధిలో జరిగిన ఇద్దరి మహిళల హత్యల మిస్టరీ ఇంకా వీడలేదు. ఈ నెల 1న మండలంలోని మిట్టాపూర్ శివారులో ఓ గుర్తుతెలియని మహిళ, గత నెల 24న నాగేపూర్ శివారులో మద్దెపల్లికి చెందిన శ్యామలలక్ష్మి(45) హత్యకు గురైన విషయం తెలిసిందే. కాగా ఈ కేసులలో మిస్టరీ సోమవారం సాయంత్రం దాకా వీడలేదు. మిట్టాపూర్ శివారులో జరిగిన మహిళ హత్య కేసులో మృతురాలి తల, కుడి చేతి మణికట్టు, ఎడమ చేతి వేళ్ల జాడ సైతం లభించలేదు. మిట్టాపూర్ హత్యకు సంబంధించి పోలీసులు సమీప గ్రామాలలో సీసీ కెమెరాలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. ఈ కేసుల్లో పురోగతి సాధించడానికి నిజామాబాద్ నార్త్ రూరల్ సీఐ శ్రీనివాస్ నవీపేటలో దర్యాప్తు కొనసాగిస్తున్నారు. త్వరలో ఛేధించి నిందితులను పట్టుకుంటామని పోలీసులు పేర్కొన్నారు.

హుమ్నాపూర్‌లో వ్యక్తి అదృశ్యం

వర్ని, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని హుమ్నాపూర్‌కు చెందిన కొడిచర్ల హన్మాండ్లు(49) అదృశ్యమైనట్లు ఎస్సై మహేష్ తెలిపారు. నవంబర్ 1వ సాయంత్రం ఇంటినుంచి వెళ్లిన ఆయన ఇప్పటి వరకు తిరిగిరాలేదని ఎస్సై తెలిపారు. హన్మాండ్లు అల్లుడు వంకాయల దేవేందర్ సోమవారం ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

వేల్పూర్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): వేల్పూర్ మండలం పడిగెల గ్రామంలోని బైపాస్ రోడ్డుపై సోమవారం సాయంత్రం గుర్తు తెలియని మృతదేహం లభ్యమైంది. మృతునికి సుమారు 35 ఏళ్లు ఉంటాయని, టీషర్టు, జీన్స్‌ప్యాంట్ ధరించి ఉన్నాడని గ్రామస్థులు తెలిపారు. గ్రామంలో ప్రధాన మురికికాలువలో పడి ఉన్న వ్యక్తిని బయటకుతీసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతుడు ఆంధ్రప్రదేశ్ నుంచి వలస వచ్చి మేస్త్రీ వద్ద పనిచేస్తుంటాడని తెలుస్తోంది.

డ్రంక్ అండ్ డ్రైవ్.. ఇద్దరికి జైలు శిక్ష

సుభాష్‌నగర్, నవంబర్ 3,(ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనాలు నడుపుతున్న 23 మందికి ట్రాఫిక్ ఏసీపీ మస్తాన్ అలీ ఆదేశాల మేరకు కౌన్సెలింగ్ నిర్వహించినట్లు ట్రాఫిక్ ఇన్స్‌పెక్టర్ ప్రసాద్ తెలిపారు. అనంతరం వారిని సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ ముందు హాజరుపర్చగా ఇద్దరికి 2 రోజుల జైలు శిక్ష, 21 మందికి జరిమానా విధించారన్నారు.

వ్యక్తికి 2 రోజుల జైలు

ధర్పల్లి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): భీంగల్ మండలం దేవక్కపేట గ్రామానికి చెందిన చిగురాల రాజు అక్టోబర్ 31న బంధువుల ఇంటికి వచ్చి అర్ధరాత్రి మద్యం మత్తులో పలుమార్లు డయల్ 100కు కాల్ చేసి పోలీసుల విధులను, సమయాన్ని దుర్వినియోగం చేసినందుకు 2వ క్లాస్ మేజిస్ట్రేట్ డయల్ 100ను దుర్వినియోగపర్చిన రాజుకు రెండు రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పును వెల్లడించినట్లు ఎస్సై తెలిపారు.

గుర్తుతెలియని వాహనం ఢీ.. యువకుడు మృతి

బోధన్, నవంబరు3 (ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని డీసీఎం వాహనం ఢీకొని ఖైరోద్దీన్(17) అనే యువకుడు మృతి చెందినట్లు బోధన్ రూరల్ ఎస్ఐ మచ్చేందర్ రెడ్డి తెలిపారు. వివరాలు.. ఆదివారం రాత్రి మహారాష్ట్రలోని రోహిని గ్రామానికి చెందిన ఖైరోద్దీన్, సమీర్, శంభు ఖాజాపూర్ వెళ్తుండగా సాలూర క్యాంప్ శివారులో ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి కిందపడ్డారు. ఖైరోద్దీన్ రోడ్డుపై పడిపోగా గుర్తుతెలియని డీసీఎం వాహనం అతని కాళ్లపై నుండి వెళ్లింది. సమాచారం అందుకున్న పోలీసులు చికిత్స నిమిత్తం బోధన్ ఆసుపత్రికి తరలించగా ఆదివారం అర్ధరాత్రి మృతి చెందినట్లు తెలిపారు. ప్రమాదానికి గురైన డీసీఎం సంఘటన స్థలం నుంచి వెళ్లిపోయిందన్నారు. మృతుడి తల్లి తస్లీమాబీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపడుతున్నామన్నారు.

డిఫెన్స్ మద్యం సీసాల పట్టివేత

కామారెడ్డి టౌన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): కామారెడ్డి జిల్లా కేంద్రంలో డిఫెన్స్‌కు చెందిన 17 మద్యం సీసాలను సోమవారం పట్టుకున్నట్లు పట్టణ ఎక్సైజ్ ఎస్సై విక్రమ్ తెలిపారు. పట్టణంలోని యాదగిరి, సుధాకర్ అనే వ్యక్తులు ఎటువంటి నాన్‌డ్యూటీ అనుమతులు తీసుకోకుండా డిఫెన్స్ మద్యంను కలిగి ఉన్నారని గుర్తించి అరెస్టు చేసినట్లు తెలిపారు. వారి వద్ద నుంచి 17 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. డిఫెన్స్ లిక్కర్ చట్ట విరుద్ధంగా కలిగి ఉండడం నేరమని అన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ సంపత్ కృష్ణ, సిబ్బంది దేవకుమార్, శ్రీరాఘ, రమ, భాస్కర్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

వాటర్ ట్యాంక్ ఎక్కిన ప్రేమజంట

లింగంపేట, నవంబర్ 3 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం పక్కన ఉన్న వాటర్ ట్యాంక్ పైకి ప్రేమ జంట ఎక్కి ఉండడంతో స్థానికులు చూసి వారిని కిందకి పిలిచి పోలీసులకు అప్పగించారు. మండలంలోని కన్నాపూర్‌కు చెందిన యువకుడు హైదరాబాద్‌లో పని చేస్తు అక్కడే ఒక బాలికను ప్రేమించాడు. బాలిక ను తీసుకుని గ్రామానికి వాచ్చాడు. విషయం పోలీసులకు తెలియడంతో పోలీసులు వారికి కౌన్సెలింగ్ నిర్వహించి బాలిక ను వదిలి వేయాలని యువకునికి హెచ్చరించి పంపించారు. సోమవారం ఉదయం బాలిక, యువకుడు వాటర్ ట్యాంక్ ఎక్కి చాలా సమయం వాటర్ ట్యాంక్ పైన ఉండడంతో అనుమానం వచ్చిన స్థానికులు ఎవరో యువతి యువకులు ట్యాంక్‌పైన ఉన్నారని వారిని కిందకు దిగాలని హెచ్చరించారు. విషయాన్ని పోలీసులకు తెలియజేశారు. యువకుడు బాలిక కిందకు వచ్చారు. ఎస్సై యువకున్ని హెచ్చరిస్తూ బాలిక వద్దకు ఎందుకు వచ్చావని అడగగా బాలికతో కలిసి చనిపోయేందుకు వచ్చామని అందుకే టవర్ ఎక్కినట్లు తెలిపారు. దీంతో ఎస్సై దీపక్‌కుమార్ వారికి కౌన్సెలింగ్ నిర్వహించి వారిని హైదరాబాద్‌కు పంపించినట్లు తెలియజేశారు.

నిప్పంటించుని వ్యక్తి మృతి

వర్ని, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): లక్ష్మాపూర్ గ్రామంలో బొంతల సాయిలు అనే వ్యక్తి ఒంటికి నిప్పం టించుకుని మృతి చెందినట్లు ఎస్సై మహేష్ తెలిపారు. నాలుగు నెలల క్రితం మృతుని భార్య ఇంటి నుంచి వెళ్లి పోయిందన్న మనస్థాపంతో ఇంటి వద్ద ఒంటరిగా ఉన్న సమయంలో ఒంటికి నిప్పంటించుకున్నట్లు తెలిపారు. తీవ్ర గాయాలకు గురైన క్షతగాత్రున్ని చికిత్స నిమిత్తం జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు.

ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి భూమిపూజ

సాలూర,నవంబరు3(ఆంధ్రజ్యోతి): సాలూర మండల కేంద్రంలో మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి సోమవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పేదోడి ఇంటి కల ఒక్క కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ఇంటి నిర్మాణ పనులు కొనసాగే క్రమంలో దశలవారీగా ప్రభుత్వం బిల్లులను చెల్లించడం జరుగుతుందని స్పష్టం చేశారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్దిదారులు త్వరితగతిన ఇళ్ల నిర్మాణాలు చేపట్టి బిల్లులను స్వీకరించి కలను సహకారం చేసుకోవాలని కోరారు.



మైదానంలో పారబోసిన కూరగాయల వ్యర్థాలు

మైదానంలో వ్యర్థాలు.. విద్యార్థులకు కష్టాలు

డొంకేశ్వర్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): వందలాది మంది విద్యార్థులు చదువుతున్న మహాత్మా జ్యోతిబాపూలే పాఠశాలలో పరిసరాలు అధ్వానంగా ఉన్నాయనడానికి పై చిత్రమే నిదర్శనం. విశాలమైన మైదానం చెత్తాచెదారంతో కలుషితమైంది. డొంకేశ్వర్ మండలం నూత్‌పల్లిలో ఉన్న ఈ పాఠశాల ఆవరణలో ఎటు చూసినా చెత్తాచెదారమే. విద్యార్థుల కోసం వంటచేయగా మిగిలిన కూరగాయల వ్యర్థాలను పాఠశాల ఆవరణలో కుప్పగా పోస్తున్నారు. దీంతో దుర్వాసనతో విద్యార్థులకు ఇబ్బంది తప్పట్లేదు. విద్యార్థులు రోగాలబారిన పడే అవకాశముందని తల్లిదండ్రులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఆందోళన వద్దు.. తడిసిన ధాన్యం కొంటాం



కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

మాక్లూర్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): వర్షాలకు తడిసిన ధాన్యం వల్ల రైతులు ఆందోళన చెందవద్దని, మద్దతు ధర చెల్లిస్తూ ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్ భరోసా కల్పించారు. మాక్లూర్‌లో సహకార సంఘం ఆధ్వర్యంలో నెలకొల్పిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం రాష్ట్ర వ్యవసాయ కమిషన్ సభ్యుడు గడుగు గంగాధర్‌తో కలిసి పరిశీలించారు. రైతుల నుంచి ఇప్పటివరకు సేకరించిన ధాన్యం నిల్వల గురించి నిర్వాహకులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. రైతులతో మాట్లాడి కొనుగోలు కేంద్రాల్లో ఏవైనా ఇబ్బందులున్నాయా అని ఆరా తీశారు. తడిసిన ధాన్యానికి మద్దతు ధర చెల్లిస్తూ బాయిల్డ్ రైస్ మిల్లులకు తరలించేలా చర్యలు తీసుకున్నామని హామీ ఇచ్చారు. వర్షాలకు ధాన్యం తడిసిపోకుండా ఎక్కువ సంఖ్యలో టార్పలిన్‌లు అందుబాటులో ఉంచాలని, సూచించారు. రైతులు ధాన్యం తెచ్చిన వెంటనే తూకం వేయించి లారీలలో లోడు చేయించి మిల్లులకు పంపించాలని అన్నారు. వీరి వెంట విండో చైర్మన్ భూరోల్ల అశోక్, సివిల్ సప్లై డీఎం శ్రీకాంత్‌రెడ్డి, డీఎస్‌వో అర్వింద్‌రెడ్డి, డీసీవో శ్రీనివాస్‌రావు, జిల్లా వ్యవసాయాధికారి గోవింద్, తహసీల్దార్ శేఖర్, వెంకటేశ్వర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.



పల్లకీ సేవలో పాల్గొన్న భక్తులు

ఘనంగా పల్లకీ సేవా

పెర్కిట్, నవంబరు3(ఆంధ్రజ్యోతి): కార్తీక సోమవారం పురస్కరించుకొని ఆర్మూర్ పట్టణంలోని నవనాథ సిద్దుల గుట్టపై భక్తులు అధికసంఖ్యలో విచ్చేసి శివాలయంలో పంచామృతాలతో, బిల్వా పత్రాలతో అభిషేకం చేశారు. ఉసిరికాయ, నెయ్యి వత్తులు దీపాలతో మహిళ భక్తులు గుట్టపైకి విచ్చేసి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ఒకరినొకరు వాయినాలు ఇచ్చుకున్నారు. నందీశ్వర మహారాజ్ ఆధ్వ ర్యంలో నిర్వహించిన పల్లకీసేవలో ఆర్మూర్ భజన మండలి సభ్యులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



తడవకముందు ఆలస్యం..
తడిస్తే నిబంధనలు

- అన్నదాతకు తప్పని కష్టాలు
- కొనుగోళ్ల ప్రక్రియ వేగం చేయాలని వేడుకోలు

ఖరీఫ్ సాగు వరి రైతులను నట్టేట ముంచింది. ఓవైపు వర్షం మరోవైపు నత్తనడకన సాగుతున్న వరి కొనుగోళ్లతో అన్నదాతలు రైతులు నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అకాల వర్షాలకు కర్షకులు తమ ధాన్యాన్ని కాపాడుకునేందుకు పరుగులు తీస్తున్నారు. అయినప్పటికీ చేతికొచ్చిన పంట నీట మునగడంతో రైతుల గోస వర్ణనాతీతంగా మారింది. దీనికి తోడు కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం నత్తనడకన సాగడంతో రైతులు పరిస్థితి అగమ్యగోచారంగా తయారైంది.

ధర్పల్లి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): అసలే అకాలవర్షం, కొనుగోళ్ల ఆలస్యం వంటి సమస్యలతో ఇబ్బంది పడుతున్న రైతులకు కొనుగోలు కేంద్రాల్లో తూకంలో మోసం జరగడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

ఇటీవల వెలుగులోకి వచ్చిన మోసం..

మండల కేంద్రంలో ఇటీవల తూకంలో మోసం జరగడంతో రైతులు నిలదీశారు. దీంతో సంబంధిత వ్యక్తులు గిట్టుబాటు చర్యలు చేపట్టినట్లు తెలిసింది. గ్రామంలో సింగిల్ విండో ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కొనుగోలు కేంద్రంలో కొనుగోళ్లు ఇష్టారాజ్యంగా జరుగుతున్నట్లు రైతులు ఆరోపిస్తున్నారు. తన మాటే శాసనంగా కొనుగోలు కేంద్రంలో అన్ని తానై వ్యవహరిస్తున్న వ్యక్తిపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అయినప్పటికీ సదరు వ్యక్తిని ఏమనలేక ఫిర్యాదు చేస్తే తమ ధాన్యాన్ని తూకం వేయడన్న భయంతో రైతులు ఫిర్యాదు చేయడం లేదని విమర్శలు వస్తున్నాయి.

చర్యలు తీసుకోకపోవడంతో విమర్శలు

కొనుగోలు కేంద్రంలో తూకం వేసే సమయంలో జరిగిన అవకతవకలపై ఇటీవల రెడ్ హ్యాండెడ్‌గా రైతులు పట్టుకున్నట్లు సమాచారం. కొనుగోలు కేంద్రాల్లో ఇష్టారీతిన వ్యవహరిస్తున్న తీరుపై అధికారులు చర్యలు తీసుకోకపోవడంతో పలు విమర్శలు వస్తున్నాయి. మండల కేంద్రంలోని దమ్మన్నపేటలో కొనుగోలు కేంద్రం నత్తనడకన కొనసాగుతుండటంతో రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఒకవైపు రైతులు తమ పంటను కాపాడుకుంటూనే మరోవైపు తూకం కోసం కల్లాల వద్దే ఎదురు చూస్తున్నారు. తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని ఉన్నతాధికారులు అంటున్నప్పటికీ తేమ శాతం పేరుతో ధాన్యాన్ని కోతకు విధిస్తున్నారు. క్వింటాలుకు 5కిలోలకు పైగా తూకంలో కోత విధిస్తున్నట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ధాన్యం సేకరణను వేగవంతం చేసి తమను ఆదుకోవాలని కోరుతున్నారు.

కళాశాలల నిరవధిక బంద్

బోధన్,నవంబరు3(ఆంధ్రజ్యోతి): గడిచిన నాలుగు సంవత్సరాల నుంచి ఫీజు రియింబర్స్‌మెంట్ విడుదల చేయనందున గత్యంతరం లేని పరిస్థితులలో సోమవారం నుంచి బోధన్‌లో ఉన్న అన్ని ప్రైవేట్ కళాశాలలు నిరవధిక బంద్ పాటిస్తున్నాయని ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు తెలిపాయి. ఉషోదయ విద్యాసంస్థల చైర్మన్ సూర్యప్రకాష్, మిమ్స్ డిగ్రీ కళాశాల చైర్మన్ ఓంకారం శ్రీనివాస రాజు, ఎస్వీ డిగ్రీ కళాశాల డైరెక్టర్ రవి పటేల్, విజయసాయి డిగ్రీ కళాశాల డైరెక్టర్ రషీద్ మాట్లాడుతూ.. తెలంగాణ యూనివర్సిటీ ప్రైవేటు కళాశాలల యాజమాన్య సంస్థ ఆధ్వర్యంలో బోధన్ పట్టణంలోని అన్ని ప్రైవేటు కళాశాలల బంద్‌కు సోమవారం నుంచి పిలుపునిచ్చామని తెలిపారు. 2021 సంవత్సరం నుంచి బకాయి పడిన ఫీజులను కళాశాలలకు చెల్లించడంలో ప్రభుత్వం సాక్షివేత ధోరణిని నిరసిస్తూ ఆర్థిక ఇబ్బందుల కారణంగా కళాశాలల అధ్యాపకులకు వేతనాలు, ప్రభుత్వ పన్నులు, విద్యుత్ శక్తి బిల్లులు, యూనివర్సిటీ ఫీజులు చెల్లించే స్థితి లేక కళాశాలల మనుగడ ప్రశ్నార్థకంగా మారిందని చెబుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో విద్యార్థుల నుంచి ఫీజులను వసూలు చేసే స్థితి లేక గత్యంతరం లేని పరిస్థితులలో ప్రభుత్వం నుంచి సానుకూల స్పందన వచ్చే వరకు సోమవారం నుంచి నిరవధికంగా డిగ్రీ కళాశాలలు బంద్ పాటిస్తున్నాయన్నారు. అన్నారు.

బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలుచేయాలి



వినతిపత్రం అందజేస్తున్న బీసీ సంఘాల నాయకులు

కమ్మర్‌పల్లి, నవంబరు 3: (ఆంధ్రజ్యోతి): బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ ప్రభుత్వం తీసుకొచ్చిన జీవోను అమలుపర్చాలని కోరుతూ సోమవారం బీసీ రిజర్వేషన్ సాధన కమిటీ పిలుపుమేరకు కమ్మర్‌పల్లి మండల బీసీ సంఘాల నాయకులు తహసీల్దార్ ప్రసాద్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బీసీ సంఘాల నాయకులు అశోక్, గుండోజి నవీన్, బీసీ, ఎస్టీ ఎస్సీ జేఏసీ నాయకులు నల్ల కైలాస్, మెరుగు నాగేశ్వర్, గుర్రం సాగర్, ప్రేమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పసుపు ఉత్పత్తుల పరిశ్రమను పరిశీలించిన బ్యాంక్ అధికారులు

జక్రాన్‌పల్లి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మనోహరాబాద్ గ్రామంలో సోమవారం రైతు పసుపు ఉత్పత్తుల పరిశ్రమను యూనియన్ బ్యాంక్ అధికారులు సందర్శించారు. యూనియన్ బ్యాంక్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ జయ కృష్ణ, మేనేజర్ వైభవ్, స్థానిక యూనియన్ బ్యాంక్ మేనేజర్ సుమలత, అధికారులు కలిసి పసుపు ఉత్పత్తుల పరిశ్రమను సందర్శించి అనంతరం పసుపు పౌడర్ తయారు చేసే యంత్రాలను పరిశీలించారు. ఈ యంత్రాలు పసుపు పౌడర్ తయారు చేసే విదానాన్ని మిగితా యంత్రాలను వారు పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జేఎం కేపీఎం ఎఫ్‌పీవో చైర్మన్ పి. తిరుపతి రెడ్డి, డైరెక్టర్లు అల్లూరి సంతోష్‌రెడ్డి, సూపర్ వైజర్ రుత్విక్, బుచ్చిరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

కారు, బైక్ ఢీ.. ఇద్దరికి గాయాలు




కారు,బైక్ ఢీకొన్న దృశ్యం

నాగిరెడ్డిపేట, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాండూర్ గేటు వద్ద హైదరాబాద్ - బోధన్ జాతీయ రహదారిపై సోమ వారం కారు, బైక్ ఢీకొని ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయ పడ్డారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మండలం లోని వెంకంపల్లి గ్రామానికి చెందిన మాసిని సంగయ్య తన బైక్ పైన వెంకంపల్లి గ్రామం నుంచి మండల కేంద్రానికి వెళ్తుండగా, నాగిరెడ్డిపేట మండల కేంద్రం వైపు నుంచి బాన్సు వాడకు వెళుతున్న కారు తాండూర్ గేటు వద్ద కారు, బైక్ ఢీ కొన్నాయి. ఈ ప్రమాదంలో బైక్‌పై వెళ్తున్న వెంకంపల్లి గ్రామానికి చెందిన మాసిని సంగయ్య, కారు డ్రైవర్ సంగు లిద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన క్షతగాత్రులను 108 అంబులెన్స్‌లో చికిత్స కోసం ఎల్లారెడ్డి ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

పదవీ విరమణ సహజం

● పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు మోహన్ రెడ్డి



ఉపాధ్యాయుడు సాయన్న దంపతులను సన్మానిస్తున్న దృశ్యం

రెంజల్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి పదవి విరమణ సహజమని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షులు పొద్దుటూరి మోహన్ రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని దూపల్లి పాఠశాలలో బయోసైన్స్ ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న సాయన్న ఉద్యోగ విరమణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తిలో 35ఏళ్లుగా తన సేవలను విద్యార్థులకు అందించి ఉన్నతులుగా తీర్చిదిద్దిన ఘనత సాయన్నదని ఆయన సేవలు అనేకం అని కొనియాడారు.



గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఎంఈవో

పాఠశాలలో వ్యాసరచన పోటీలు

డొంకేశ్వర్, నవంబరు3(ఆంధ్రజ్యోతి): డొంకేశ్వర్ మండల కేంద్రంలోని పీఎంశ్రీ ప్రభుత్వ పాఠశాలలో మండలస్థాయి వ్యాసరచన ఉపన్యాసం క్విజ్ పోటీలను తెలంగాణ గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘం ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ రామకృష్ణ మాట్లాడుతూ.. రాబోయే పదవ తరగతి పరీక్షలను దృష్టిలో ఉంచుకొని ప్రణాళిక బద్ధంగా చదివి గతేడాది కంటే ఈ ఏడాది మంచి ఫలితాలు విద్యార్థులు సాధించాలని తెలిపారు. అనంతరం మండల స్థాయి వ్యాసరచన పోటీలో సాయి స్నిగ్ధ, క్విజ్ పోటీలలో మనుష బృందం గెలుపొందారు. విజేతలకు ఆయన బహుమతులను అందజేశారు. వీరు నవంబర్ 5, 7వతేదీల్లో జిల్లాస్థాయి పోటీలలో పాల్గొననున్నారని తెలిపారు. ఇంచార్జి ప్రధానోపాధ్యాయులు మహేష్ కుమార్, సాయికుమార్, గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.



అంబేద్కర్ చౌరస్తాలో సీఎం చిత్రపటానికి పాలాభిషేకం దృశ్యం

రైతుల సంక్షేమమే కాంగ్రెస్ ధ్యేయం

బోధన్,నవంబరు3(ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని, ఎన్నికలలో ఇచ్చిన హామీ ప్రకారం రైతులకు రూ.500 బోనస్ ఇచ్చిన ఘనత కాంగ్రెస్ పార్టీదేనని టీపీసీసీ డెలిగేట్ గంగాశంకర్ అన్నారు. రైతులకు రూ.500 బోనస్ అందజేసిన సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు, ప్రభుత్వ ముఖ్య సలహాదారుడు, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు. రైతుల పక్షపాతి కాంగ్రెస్ పార్టీ అని, ఇచ్చిన హామీలను నెరవేర్చిన ఘనత సీఎం రేవంత్‌దే అన్నారు. అనంతరం స్వీట్లు పంచుకుని సంబరాలు నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు పాషా మొయినోద్దీన్, శివాలయం కమిటీ చైర్మన్ హరికాంత్ చారి, మారుతిమందిరం చైర్మన్ గుండేటి శంకర్, మాజీ మున్సిపల్ చైర్మన్ ఎల్లమయ్య, పార్టీ నాయకులు శరత్ రెడ్డి, జావీద్, సంజీవ్ రెడ్డి, నక్కా లింగారెడ్డి, దాము, సంగ్రామ్, ఉర్దూఘర్ చైర్మన్ బ్యాటరీ బాబా, తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రానికి లారీల కొరత తీర్చండి

ఏర్గట్ల, నవంబరు 3(ఆంధ్రజ్యోతి) : దోంచంద గ్రామంలో తాళ్ళరాంపూర్ సొసైటీ ఆధ్వర్యంలో మార్క్‌ఫెడ్ ద్వారా ఏర్పాటు చేసిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రానికి లారీల కొరత ఉండటంతో మొక్కజొన్న ఎక్కడికక్కడే నిలిచిపోయిందని, వర్షాలు కురిసే అవకాశాలున్నాయని వెంటనే లారీల కొరత లేకుండా చూడాలని మండలంలో దోంచంద రైతులు సోమవారం తహసీల్దార్ మల్లయ్య వినతి పత్రం అందజేశారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల పరిశీలన

ఆర్మూర్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఆలూర్ లో సోమవారం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కొనుగోలు కేంద్రాలను జిల్లా వ్యవసాయాధికారి మేకల గోవింద్ పరిశీలించారు. ఈ సందర్భంగా ధాన్యం కొనుగోలు రికార్డులు, టూకాలు, చెల్లింపుల విధానాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి రాంబాబు, సొసైటీ వైస్ చైర్మన్ చేపూర్ రాజేశ్వర్, డైరెక్టర్ల దేగాం ప్రమోద్, పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

ఆలూర్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి):ఆలూర్ మండలంలోని గగ్గుపల్లి గ్రామంలో సోమవారం ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎంపీడీవో గంగాధర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం మహిళలకు అధిక ప్రాధాన్యతను ఇస్తుందని ఇందులో భాగంగానే మహిళా సంఘాలకు అధిక సంఖ్యలో కొనుగోలు కేంద్రాలను కేటాయించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం భూమేశ్వర్, పంచాయితీ కార్యదర్శి కిషోర్, సీసీ ప్రకాస్, ఏఈవో వసుదాం పాల్గొన్నారు.

జోనల్ స్థాయి కబడ్డీ పోటీలకు జట్ల ఎంపిక

వేల్పూర్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): వేల్పూర్ మండల మోతె ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోమవారం భీమ్‌గల్ రూరల్ జోనల్ స్థాయి కబడ్డీ పోటీలకు క్రీడాకారులను ఎంపిక చేశారు. కబడ్డీ అండర్ -17 బాల బాలికల పోటీలను నిర్వహించి మంచి ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను ఎంపిక చేసినట్లు ప్రధానోపాధ్యాయులు వైద్య గణేష్, పీడీ సురేష్ తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు మంగళవారం ముప్కాల్‌లోని భూదేవి ఇండోర్ స్టేడియంలో జరిగే జిల్లా స్థాయి పోటీలలో పాల్గొంటారన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కబడ్డీలో భీమ్‌గల్ జోన్‌కు మంచి పేరు ఉందని జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచి రాష్ట్రస్థాయికి ఎంపిక కావాలని క్రీడాకారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాల ఫిజికల్ డైరెక్టర్లు సురేష్ కుమార్, వేల్పూర్ ఫిజికల్ డైరెక్టర్ రాజేందర్, చిన్నయ్య పాల్గొన్నారు.

వన మహోత్సవం

బోధన్,నవంబరు3(ఆంధ్రజ్యోతి): బోధన్ పట్టణం ఆచన్‌పల్లిలో ఆర్బీసీ కాలనీలో సోమవారం లయన్స్ క్లబ్ ఆఫ్ ఆచన్‌పల్లి ఆధ్వర్యంలో వన మహోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా లయన్స్ డిస్ట్రిక్ గవర్నర్ ఏ.అమర్‌నాథ్ రావు ఆయన సతీమణి జ్యోతి ముఖ్య అతిథిగా పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా లయన్స్ డిస్ట్రిక్ గవర్నర్ మాట్లాడుతూ లయన్స్ క్లబ్ ఆఫ్ ఆచన్‌పల్లి చేపడుతున్న సామాజిక సేవ కార్యక్రమాలు అభినందనీయమన్నారు. లయన్స్ ఇంటర్నేషనల్ పర్యావరణ పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యతను ఇస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ జోనల్ చైర్మన్ ఓంప్రకాష్, కరుటూరి రామకృష్ణ, లయన్స్ క్లబ్ ప్రతినిధులు ఐఆర్ చక్రవర్తి, కేవీ సత్యనారాయణ, శ్రీనివాస రాజు, హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

చికిత్స కోసం ఎల్‌వోసీని అందజేసిన ఎమ్మెల్యే

మోర్తాడ్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన అమిన్ బేగాం అనారోగ్యానికి గురై నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స కోసం చేరడంతో కుటుంబ సభ్యులకు బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి రూ. 2 లక్షల ఎల్‌వోసీని అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డికి బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞలు తెలిపారు.

మృతుల కుటుంబాలకు ఎమ్మెల్యే ఆర్థిక సాయం

వేల్పూర్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెంది న అశోక్ (అబ్బాస్), కాకి బాలయ్య కుమారుడు ఇటీవల అనారోగ్యంతో మరణించాడు. ఈ విష యాన్ని ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి బిఆర్‌ఎస్ నాయకుల ద్వారా ఆ మృతుల కుటుంబాలకు ఆర్థిక సహాయం అందజేశారు. మృతుల కుటుంబాలను బీఆర్‌ఎస్ నాయకులు పరామర్శించి సంతాపం తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్‌ఎస్ నాయకులు రేగుల్ల రాములు, బబ్బురు ప్రతాప్‌రెడ్డి, పిట్ల సత్యం, సామ మహేందర్, ఎం.సురేష్, సుంకరి రాము ఉన్నారు.

మృతుడి కుటుంబ సభ్యులకు చెక్కు అందజేత

బోధన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో ఉన్న విద్యుత్ సిబ్బంది బెల్లాల్ మహేందర్ అనే వ్యక్తి మే నెలలో మృతి చెందగా మృతుడి భార్య నాగలక్ష్మికి సోమవారం 8.16లక్షల చెక్కును బోధన్ విద్యుత్ శాఖ అధికారి ముక్తార్ హైమద్ అన్నారు. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన వారిని ప్రభుత్వం అన్నివిధాల ఆదుకుంటుందన్నారు. మృతుడి భార్య నాగలక్ష్మి ఉద్యోగం కోసం కూడా ప్రతిపాదనలు పంపించామన్నారు.

సరస్వతీ దేవి విగ్రహ ప్రతిష్ఠాపన

నవీపేట, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని యంచ యూపీఎస్ పాఠశాల ఆవరణలో సోమవారం ఘనంగా సరస్వతి దేవి విగ్రహ ప్రతిష్ఠాపన నిర్వహించారు. స్థానిక శ్రీ ఓం జగదాద్రి ఆలయ వ్యవస్థాపకురాలు స్వర్ణ కమల లక్ష్మి సంబంధిత సరస్వతి విగ్రహాన్ని పాఠశాలకు అందజేశారు. ఈ సందర్భంగా సరస్వతి దేవి విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సిబ్బంది, వీడీసీ సభ్యులు పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణ కోసం గ్రామ సభ

మోస్రా, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): చందూర్ మండల కేంద్రంలో జరుగుతున్న రోడ్డు విస్తరణపనుల విషయంపై సోమవారం రోజు గ్రామ పంచాయతీ ఆవరణలో గ్రామంలో పెద్ద బస్టాండ్ మెయిన్ రోడ్డు నుంచి గ్రామ పంచాయతీ వరకు రోడ్డు విస్తరణ గురించి అదే విధంగా 2026-27 సంవత్సరానికి ఎంజీఎన్ఆర్ఈజీఎస్ ఉపాధి హామీ పనులు గుర్తింపు వంటి అంశాలపైన గ్రామ సభ నిర్వహించారు. రోడ్డు వెడల్పు 66ఫీట్లు ఉండాలని వివరించగా కొందరు ఇళ్లు అడ్డుగా ఉన్నాయని అధికారులు తెలిపారు. ఈ విషయంపై గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారి నీలావతి, కార్యదర్శి సాయిలు శాఖ వారికి సమస్యపై లేక రాసి పంపుతామని గ్రామస్థులకు తెలిపారు.

క్రీడా పోటీల నిర్వహణకు రూ.80వేల విరాళం

నవీపేట, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 20, 21, 22వ తేదీల్లో మండలంలోని నాళేశ్వర్‌లో జరిగే మండల స్థాయి అంతర్ పాఠశాలల క్రీడా పోటీల నిర్వహణకు సోమవారం రూ.80వేల విరాళాలను అందజేశారు. స్థానిక జడ్పీహెచ్‌ఎస్ పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది 30వేల రూపాయలు, నాళేశ్వర్ వీడీసీ సభ్యులు 30వేల రూపాయలు, మాజీ సర్పంచ్ నరిన్ 15వేల రూపాయలు, బీ.రాజేందర్ రూ.5వేల విరాళాన్ని అందజేశారు.

పరీక్షల్లో విద్యార్థులు సత్తాచాటాలి



విద్యార్థినితో మాట్లాడుతున్న తహసీల్దార్ అనిల్ కుమార్

పెద్దకొడప్‌గల్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): రానున్న రోజుల్లో నిర్వహించే 10వ తరగతి వార్షిక పరీక్షల్లో విద్యార్థులు సత్తాచాటి పాఠశాలతో పాటు, మండలానికి మంచిపేరు తీసుకరావాలని తహసీల్దార్ అనిల్ కుమార్ విద్యార్థులకు సూచించారు. సోమవారం మండల కేంద్రంలోని ఉన్నత, ప్రాథమిక పాఠశాలలను సందర్శించిన ఆయన విద్యార్థులతో ముచ్చటించారు. పాఠశాలల్లో బోధన అందుతున్న తీరును విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు బోధించిన పాఠాలను విద్యార్థులు చక్కగా వినాలని, తిరిగి వాటిని మననం చేసుకుని పరీక్షల్లో మంచి మార్కులు తెచ్చుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవో ప్రవీణ్ కుమార్, ఉపాధ్యాయ బృందం కిషోర్ సింగ్, నాగ్‌నాథ్ తదితరులు పాల్గొన్నారు.

వివరాల నమోదు సక్రమంగా చేయండి



ఉపాధ్యాయులకు సూచనలిస్తున్న ఎంఈవో ప్రవీణ్

పెద్ద కొడప్‌గల్, నవంబరు 03 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆయా గ్రామాల పరిధిలో గల ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాఠశాలకు సంబంధించిన వివరాలను ఆన్‌లైన్‌లో సరిగ్గా నమోదుచేయాలని ఎంఈవో ప్రవీణ్ కుమార్ సూచించారు. సోమవారం మండల కేంద్రంలో నిర్వహించిన ప్రధానోపాధ్యాయుల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఏటా పాఠశాలకు సంబంధించిన ఆయా వివరాలను సంబంధిత ప్రధానోపాధ్యాయులు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తుంటారని, ఈ సారి కూడ అదేవిధంగా చేయాలన్నారు. ఇందుకు సంబంధించిన వివరాలు డాటా కాప్చర్ ఫార్మట్‌లో నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామాలకు చెందిన ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

టీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడిగా దత్తు



వట్లంగారి దత్తు

బాన్సువాడటౌన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ స్టూడెంట్ ఫెడరేషన్ కామారెడ్డి జిల్లా అధ్యక్షుడిగా వట్లంగారి దత్తు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని రాష్ట్ర అధ్యక్షుడు నవీన్‌కుమార్ సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా దత్తు మాట్లాడుతూ.. విద్యార్థుల సమస్యల పరిష్కారానికై కృషి చేస్తానన్నారు. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర అధ్యక్షుడికి ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

సుదర్శన్ రెడ్డికి శుభాకాంక్షల వెల్లువ



సుదర్శన్ రెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న సాలూర నేతలు

సాలూర,నవంబరు3(ఆంధ్రజ్యోతి): మాజీమంత్రి, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి ప్రభుత్వ ప్రత్యేక సలహాదారులుగా నియమితులైన నేపథ్యంలో ఆయనకు శుభాకాంక్షలు తెలపడానికి నాయకులు క్యూ కడుతున్నారు. సోమవారం సాలూర కాంగ్రెస్ నాయకులు హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువా కప్పి సన్మానించారు. పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. సాలూర పీఏసీఎస్ ఛైర్మన్ అల్లె జనార్ధన్, డిస్కో సాయిలు, సొక్కం రవి, గాండ్ల రాజేశ్వర్, లక్ష్మణ్ గౌడ్, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులున్నారు.

చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఇంచార్జి ఎస్‌హెచ్‌వో

నాగిరెడ్డిపేట, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని, చదువుపైనే ప్రత్యేక దృష్టి సారించి ఉత్తమ ఫలితాలు సాధించాలని ఇంచార్జి ఎస్‌హెచ్‌వో మనోహర్ రావు కోరారు. సోమవారం గోపాల్‌పేట్ మోడల్ స్కూల్లో జిల్లా పోలీసు కళాబృందం ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సైబర్ నేరాలు, బాల్య వివాహాలు, రోడ్డు ప్రమాదాల నివారణ, డ్రంక్ అండ్ డ్రైవ్, మాదకద్రవ్యాల వాడకంతో కలిగే అనర్థాల గురించి, పోక్సో చట్టం తదితర అంశాలపైన విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు చదువు పైనే దృష్టి సాధించాలన్నారు. కార్యక్రమంలో కళాబృందం ఇంచార్జి తిరుపతి, శేషారావు, ప్రభాకర్, సాయిలు, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ రాంప్రసాద్ పాల్గొన్నారు.

విఠలేశ్వర ఆలయంలో మహిళల పూజలు



విఠలేశ్వర ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న మహిళలు

బీర్కూర్, నవంబరు3(ఆంధ్రజ్యోతి): కార్తీక సోమవారం పురస్కరించుకుని మహిళలు ఆలయాలకు వెళ్లి భక్తి శ్రద్ధలతో మహాదేవుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సోమవారం బీర్కూర్ మండల కేంద్రంలోని విఠలేశ్వర ఆలయానికి మహిళలు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. స్వామిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. అనంతరం జ్యోతులు వెలిగించారు.

పాదయాత్రగా శబరిమలైకి స్వాములు



జెండా ఊపి పాదయాత్రను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పోచారం

బాన్సువాడటౌన్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): శబరిమలైకి మహాపాదయాత్ర చేయడమంటే గొప్ప సంకల్పమేనని రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు , ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం బాన్సువాడ అయ్యప్ప ఆలయం నుంచి స్వాముల శబరిమలై మహాపాదయాత్రను ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ముందుగా అయ్యప్ప ఆలయంలో ప్రత్యేక పూజలు చేపట్టారు. కార్యక్రమంలో రాష్ట్ర ఆగ్రోస్ ఛైర్మన్ కాసుల బాల్‌రాజ్, దీక్షా స్వాములు, నాయకులు, భక్తులు ఉన్నారు.

కోటగిరి: మండల కేంద్రంలోని రామాలయంలో అన్నిహంగులతో ఫంక్షన్ హాల్ పూర్తి చేసేందుకు నిధులు మంజూరు చేస్తానని ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. మిర్జాపూర్ క్యాంప్ కాలనీవాసులతో సమావేశమై మాట్లాడారు. ఫంక్షన్ హాల్ నిర్మాణానికి గతంలో రూ.60లక్షలు మంజూరు చేశానన్నారు.

రైతు మేలు కోసమే కొనుగోలు కేంద్రాలు



సబ్ కలెక్టర్ కిరణ్మయితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే లక్ష్మీకాంతరావు

మద్నూర్, నవంబరు 3 (ఆంధ్రజ్యో తి): ప్రభుత్వం రైతులకు మేలు చేసేలా గిట్టుబాటు ధర కల్పిస్తూ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటుచేస్తుందని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు అన్నారు. సోమవారం ఉమ్మడి మద్నూర్ మండలంలోని మార్కెట్ యార్డులో సీసీఐ పత్తి కొనుగోళ్లను, డోంగ్లిలో సోయా, ధోతీ గ్రామంలో వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. రైతులు కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించి ప్రభుత్వ మద్దతు ధర పొందాలని సూచించారు. ఏ గ్రేడ్ ధాన్యానికి క్వింటాల్‌కు రూ.2389, సాధారణ రకానికి రూ.2369 మద్ద తు ధర కల్పిస్తున్నామని తెలిపారు. అనంత రం డోంగ్లిలో నూతనంగా నిర్మించిన సొసైటీ భవనాన్ని ప్రారంభించారు. ఆయన వెంట మద్నూర్, డోంగ్లి కాంగ్రెస్ అధ్యక్షులు సాయిలు, గజానంద్ దేశాయి, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ సౌజన్య తదితరులు ఉన్నారు.

పిట్లం: పిట్లం వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో మార్క్‌ఫెడ్ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సోయా కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే లక్ష్మీకాంతరావు ప్రారంభిం చి మాట్లాడారు. ప్రజా ప్రభుత్వంలో రైతు లు పండించిన ధాన్యానికి గిట్టుబాటు ధర క ల్పిస్తుందని, రైతులు ఆరుగాలం కష్టపడి పండిం చిన ధాన్యాన్ని దళారులకు విక్రయించి మోస పోవద్దన్నారు. ఏఎంసీ చైర్మన్ మనోజ్ కుమార్, వైస్ చైర్మన్లు శపథం రెడ్డి, నాగిరెడ్డి, మండ లాధ్యక్షుడు హనుమాండ్లు, సీనియర్ నా య కులు రామ్‌రెడ్డి, మోహన్ రెడ్డి, విండో వైస్ చైర్మన్ వెంకట్ రెడ్డి, మోయిన్, చంద్రశేఖర్, కార్యదర్శి సంతోష్ రెడ్డి పాల్గొన్నారు.

బిచ్కుంద: రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పంటలకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే లక్ష్మీకాంతరావు తెలిపారు. సోమవారం బిచ్కుంద వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయ ఆవరణలో సొసైటీ ద్వారా ఏర్పాటుచేసిన సోయా కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో పీసీసీ డెలిగేట్ సభ్యుడు విఠల్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ కవిత, సొసైటి చైర్మన్ బాలు, గోపాల్‌రెడ్డి, శంకర్ పటేల్, గంగాధర్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

నాడు దేహమే యంత్రం.. నేడు దేనికైనా యంత్రం



ట్రాక్టర్ సహాయంతో దుక్కులు దున్ని విత్తనాలు వేస్తున్న దృశ్యం



చేతికొచ్చిన సోయా పంటను యంత్ర సహాయంతో నూర్పిడి చేస్తున్న దృశ్యం

మద్నూర్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో ఎడ్లతో వ్యవసాయం చేయడం చాలావరకు తగ్గిపోవడంతో కాలానుగుణంగా అన్నదాతలు వ్యవసా య సాగు పనుల్లో యంత్రాల వినియోగానికి ప్రాధా న్యం ఇవ్వడం విపరీతంగా పెరిగిపోయింది. నాడు సా గుపనుల్లో ఏది చేసినా అన్నదాత దేహమే ఓ యం త్రంలా కదిలి పనులన్నీ చక్కదిద్దిపెట్టేవారు. కానీ సాం కేతికత రోజురోజుకూ కొత్తపుంతలు తొక్కుతున్న నేటి రోజుల్లో వ్యవసాయంలో ప్రతి పనికీ యంత్రాలే దిక్కవుతున్నాయి. పెరుగుతున్న పెట్టుబడులు, కూలీల కొరతను అధిగమించేందుకు ప్రత్యామ్నాయ మార్గాలను అనుసరిస్తున్నారు. సాంప్రదాయ పద్ధతిలో చేసే వ్యవసా యంతో ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కోవాల్సి రావడంతో రైతులు యాంత్రీకరణ వైపు మొగ్గు చూపుతున్నారు. దుక్కి దున్నేది మొదలుకొని సరుకులను మార్కెట్‌కు తరలించే వరకు యంత్రాలను ఉపయోగిస్తున్నారు. త క్కువ సమయంలో సాగు విస్తీర్ణాన్ని పెంచడం, సకాలంలో పనులు పూర్తవ్వడంతో అన్నదాతలు యాంత్రీకరణ వైపు మళ్లేందుకు కారణాలు అవుతున్నాయి. ప్రభుత్వాలు సైతం యంత్రాలకు సబ్సిడీ కూడా ఇస్తుంది. దున్నడం మొదలు దిగుబడి చేతికొచ్చే వరకు యంత్రాలను వినియోగిస్తు న్నారు. నీటివ నరులు లేని ఉమ్మడి మ ద్నూర్ మండలంలో రైతులు వర్షాధారం పైనే పంటలు పండిస్తారు. పంటలు చేతికొచ్చిన సమయంలో అకాల వర్షాలతో నష్టపోవ డంతో చేతికొచ్చిన పంటను యంత్రాలతో కోసి ధాన్యంగా మార్చుకుం టున్నారు.

నష్టపోయిన రైతులకు పరిహారం అందించాలి

సుభాష్‌నగర్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): అకాల వర్షంతో నష్టపోయిన రైతులకు పరిహారం అందించాలని తెలంగాణ రైతుసంఘం జిల్లా కార్యదర్శి వెంకటేష్ అన్నారు. ఈ మేరకు సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో అడిషనల్ కలెక్టర్ అంకిత్‌కు వినతిపత్రం అందజేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పంట నష్టపోయిన వివరాలు సేకరించి ఎకరానికి రూ.30వేల చొప్పున నష్టపరిహారం చెల్లించాలన్నారు. రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు దేవేందర్ సింగ్, సాయిలు, రాజేశ్వర్, రాజన్న, తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు ఎస్ఐల బదిలీ

ఇందూరు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): నిజామాబాద్ కమిషనరేట్ పరిధిలో పనిచే స్తున్న ఇద్దరు సబ్‌ఇన్‌స్పెక్టర్లు బదిలీ అయ్యారు. వెయిటింగ్‌లో ఉన్న ఎస్సైలను జిల్లాలోని వేరే ఠాణాలకు అటాచ్ చేశారు. ఈ మేరకు పోలీసుకమిషనర్ సాయిచైతన్య ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం సీసీఎస్‌లో పనిచేస్తున్న ఎస్ఐ జి.మహేష్‌ను జక్రాన్‌పల్లి పోలీసుస్టేషన్‌కు బదిలీచేశారు. నిజా మాబాద్ సౌత్‌రూరల్ సర్కిల్ కార్యాలయంలో అటాచ్‌పై కొనసాగుతున్న ఎస్ఐ సామ శ్రీనివాస్‌ను ధర్పల్లి పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేశారు. బదిలీ ఉత్తర్వులు తక్షణమే అమల్లోకి రానున్నాయి



మద్నూర్‌లో సీఎం దిష్టిబొమ్మ దహనం చేస్తున్న దృశ్యం



బీర్కూర్‌లో రాస్తారోకో చేస్తున్న బీజేపీ నాయకులు

ముఖ్యమంత్రి రేవంత్ దిష్టిబొమ్మ దహనం

బీర్కూర్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఎన్నికల ప్రచారంలో భాగంగా సీఎం రేవంత్ రెడ్డి ఆపరేషన్ సింధూర్, భారత సైన్యాన్ని అవమానించేలా వ్యాఖ్యలు చేశారని బీజేపీ నాయకులు ఆరోపించారు. ఈ మేరకు సీఎం వ్యాఖ్యలను నిరసిస్తూ సోమవారం బీర్కూర్ మండల కేంద్రంలోని ప్రధానరహదారి వద్ద బీజేపీ నాయకులు రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డి ఎన్నికల్లో లబ్ధి పొందడానికి భారత సైన్యాన్ని అవమానించడం సిగ్గుచేటని విమర్శించారు. ఒక వర్గానికి మద్దతుగా మాట్లాడుతూ మత విద్వేషాలు రెచ్చగొడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేసేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

మద్నూర్: మండల కేంద్రంలో సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను బీజేపీ నాయకులు సోమవారం దహనం చేశారు. జూబ్లీహిల్స్ ఉపఎన్నికల ప్రచారంలో భాగంగా సీఎం రేవంత్ ఆపరేషన్ సింధూర్‌ను అపహస్యం చేస్తూ మాట్లాడారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశ సైనికులను కించపరిచేలా మాట్లాడిన సీఎం వెంటనే సైనికులకు, మహిళా మేజర్లకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. బీజేపీ మండల అధ్యక్షుడు తుకారాం, కృష్ణపటేల్, పండిత్ రావ్ పటేల్, ప్రవీణ్, గడ్డి తుకారాం, గోపన్ శివాజీ, మాధవ్ పాల్గొన్నారు.

శిఖం భూములను కాపాడండి



వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

సిరికొండ, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దవాల్గోట్ గ్రామ పరిధిలోని చెరువులు, కుంటల్లో కబ్జాకు గురవుతున్న శిఖం భూములను కాపాడాలని సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్ బాబు కోరారు. ఈ మేరకు సోమవారం సిరికొండలో తహసీల్దార్ రవీందర్‌రావును కలిసి వినతిపత్రం అందజేశారు. సర్వేనంబర్ 232, 233లో ఏడెకరాల 38 గుంటల భూమి ఉందని, సర్వేనెంబర్ 257లో మూడెకరాల 23 గుంటలు, సర్వేనంబర్ 258లో 23 గుంటలు, 335 సర్వే నంబర్‌లో 14 ఎకరాల 12 గుంటల భూమి ఉందని వినతి పత్రంలో పేర్కొన్నారు. శిఖం భూమి పక్కన గల పెద్దరైతులు కబ్జాచేసి శిఖం భూమిని నామరూపాలు లేకుండా చేశారని ఆరోపించారు. ప్రజా ప్రయోజనాలకు భూములు లేకుండా పోతున్నాయని తహసీల్దార్‌కు వివరించారు. ఆక్రమణలను తొలగించి హద్దులు ఏర్పాటుచేయాలని డిమాండ్ చేశారు. సీపీఎం నాయకులు గంగామోహన్, గ్రామస్థులు శేఖర్, బుచ్చన్న, కేవీపీఎస్ నాయకులు శంకర్ ఉన్నారు.

ప్రయాణికులపై డ్రైవర్ దురుసు ప్రవర్తన

బాన్సువాడ రూరల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికులకు, బస్సు డ్రైవర్‌కు మధ్య వాగ్వాదం జరగగా ప్రయాణికులను బస్సులో నుంచి దింపివేసిన ఘటన బాన్సువాడలో జరిగింది. ప్రయాణికులు తెలిపిన వివరాల ప్రకారం.. బోధన్ డిపోకు చెందిన ఆర్టీసీ అద్దె బస్సు సోమవారం బాన్సువాడ నుంచి బోధన్ కు బయలుదేరింది. కొంతదూరం వెళ్లగానే.. ముగ్గురు మహిళలు బస్సు ఎక్కేందుకు బాన్సువాడ బస్సు డిపో వద్ద రోడ్డు పక్కన నిలబడి ఆపారు. దీంతో డ్రైవర్ బస్సును ఆ మహిళల పైపైకి తీసుకెళ్లేలా చేశారు. అది గమనించిన బస్సులో ఉన్న ప్రయాణికులు డ్రైవర్‌ను అలా ఎందుకు చేశావని ప్రశ్నించారు. దీంతో డ్రైవర్ కోపంతో అసభ్య పదజాలం మాట్లాడుతూ.. దురుసుగా ప్రవర్తించాడు. ఆ తర్వాత ఆ ముగ్గురు మహిళలు బస్సులో ఎక్కారు. అయినా వాగ్వాదం ఆగకపోయేసరికి మండలంలోని సోమేశ్వర్ గ్రామ శివారు వరకు రాగానే ప్రయాణికులందరినీ దింపివేసి, బస్సు నిలిపివేశాడు. అంతటితో ఆగకుండా బస్సు ఎందుకు ఆపాల్సి వచ్చిందో తాను అధికారులకు చెప్పుకుంటానని, ఎవరూ ప్రశ్నించలేరంటూ దురుసుగా మాట్లాడాడు. ఈ విషయమై బోధన్ డిపో మేనేజర్‌ను ఫోన్లో సంప్రదించగా సంఘటనపై వివరాలను తెలుసుకొని బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు.



లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎంపీడీవో

పనులు ప్రారంభించాలి

బీర్కూర్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు వెంటనే ఇళ్ల నిర్మాణ పనులు ప్రారంభించాలని ఎంపీడీవో శ్రీనిధి లబ్ధిదారులకు సూచించారు. సోమవారం బీర్కూర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఇళ్ల లబ్ధిదారులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులతో సమావేశమయ్యారు. ఇళ్ల నిర్మాణ పనులపై చర్చించారు. గ్రామ పెద్దలు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు లబ్ధిదారులతో మాట్లాడి పనులు ప్రారంభించేలా ప్రత్యేక చొరవ తీసుకోవాలన్నారు. ఎంపీడీవో శ్రీనిధి, ఎంపీఓ మహబూబ్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, పంచాయతీ కార్యదర్శి గంగారాం, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

పవిత్రోత్సవాలు ప్రారంభం

నిజామాబాద్ కల్చరల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): నగరంలోని సుభాష్‌నగర్‌లో గల కోదండ రామాలయంలో సోమవారం పవిత్రోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆలయ ప్రాంగణంలో లక్ష్మణసమేత సీతారాముల విగ్రహాలను ఉంచి అర్చకులు తులసీ మురళీధరచార్య, కందాళై రాఘవాచార్య ప్రత్యేక పూజలు జరిపారు. వేదపండితులు గోవర్ధనం కృష్ణమాచార్య, సముద్రాల శ్రీధరాచార్య వేదమంత్రాలు పఠించగా అర్చకులు పవిత్రోత్సవ యజ్ఞక్రతువును నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ పాలక మండలి ప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు.



యజ్ఞక్రతువు నిర్వహిస్తున్న పండితులు

ఆలయాలకు కార్తీక శోభ



శంభులింగేశ్వర ఆలయంలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న భక్తులు



ఉత్సవ మూర్తులను ఊరేగిస్తున్న అర్చకులు

నిజామాబాద్ కల్చరల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): శివకేశవులకు ప్రీతికరమైన కార్తీక మాసాన్ని పురస్కరించుకొని ఉమ్మడి నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా ఆలయాలకు కార్తీక శోభ సంతరించుకుంది. కార్తీక మాసం రెండవ సోమవారం కావడంతో శివకేశవ ఆలయాల్లో భక్తులు పూజా కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సూర్యోదయానికి ముందే విష్ణు ఆలయాల్లో లక్ష్మీ దామోదర పూజలు నిర్వహించగా శివాలయాల్లో శివలింగానికి అభిషేకాలు, ప్రత్యేక బిల్వార్చన పూజలు జరిపారు. శివుడికి ప్రీతికరమైన రోజు కావడంతో శివాలయాల్లో ఉదయం ప్రారంభమైన అభిషేకాలు రాత్రి వరకు కొనసాగాయి. పలు ఆలయాల్లో కార్తీక మాసాన్ని పురస్కరించుకొని భక్తులు అన్నప్రసాదాన్ని అందజేశారు. సాయంత్రం నిర్వహించిన ఆకాశ దీపంలో భక్తులు పాల్గొని ఆలయ ప్రాంగణంలో కార్తీక దీపాలను వెలిగించారు. నీలకంఠేశ్వర ఆలయంలో నిర్వహించిన కార్తీక దీపోత్సవంలో ఆలయ కార్యనిర్వాహణ అధికారి శ్రీరాంరవీందర్ గుప్త పాల్గొనగా శంభులింగేశ్వర ఆలయంలో ఆలయ చైర్మన్ మధు, కార్యనిర్వాహణ అధికారి రాములు, అర్చకులు పాల్గొన్నారు. జిల్లా వ్యాప్తంగా ప్రసిద్ధ శ్రీవైష్ణవ క్షేత్రాలైన బీంగల్ లక్ష్మీనర్సింహస్వామి దేవాలయం, పోచంపాడ్ రామాలయం, బోధన్ వెంకటేశ్వర ఆలయం, నగరంలోని జెండా బాలాజీ మందిర్, శైవక్షేత్రాలైన బోధన్ ఏకచక్రేశ్వరాలయం, నందిపేట్ శివాలయం, ఆర్మూర్ సిద్దులగుట్ట, తదితర ఆలయాల్లో కార్తీక సందడి నెలకొంది.

సెంట్రల్ లైటింగ్ పనులు ప్రారంభించాలని ధర్నా



బిచ్కుందలో ధర్నా నిర్వహిస్తున్న దృశ్యం

బిచ్కుంద, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో నిలిచిపోయిన సెంట్రల్ లైటింగ్ పనులను వెంటనే ప్రారంభించాలని పట్టణ యువకులు ర్యాలీ నిరసన, ధర్నా చేపట్టారు. సోమవారం పట్టణంలోని రోడ్లన్నీ గుంతల మయమై పట్టించుకోని అధికార యంత్రాంగం పనితీరుపై వ్యతిరేకంగా పట్టణ బంద్‌కు పిలుపునిచ్చిన యువత అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెండు సంవత్సరాల క్రితం మంజూరై ప్రారంభమైన సెంట్రల్ లైటింగ్ పనుల కోసం జరిపిన తవ్వకాల వల్ల రోడ్లన్నీ గుంతల మయమై ద్విచక్ర వాహనదారులు ప్రతి రోజు పదుల సంఖ్యలో కింద పడిపోయి గాయల బారిన పడుతున్నట్లు తెలిపారు. వర్షాలు పడి గుంతలలో నీరు నిలిచి గుంతలు ఏర్పడక ఫోర్ వీలర్ బస్సులు, లారీలు ట్రాక్టర్‌ల టైర్ పగిలిపోవడంతో కమాన్ పట్టీలు విరిగిపోయి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న పట్టించుకోవడం పై అధికార యంత్రాంగంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే పనులను ప్రారంభించి వాహనదారులు, ప్రజల ఇబ్బందులు తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ యువకులు పాల్గొన్నారు.

విశ్రాంతి ఉద్యోగుల జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక

కామారెడ్డిరూరల్, నవంబరు3 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం కామారెడ్డి జిల్లా నూతన కార్యవర్గాన్ని సోమవారం ఎన్నికల అధికారిగా రాష్ట్ర బాధ్యుడు ప్రహ్లాదరావు ఎన్నికలు నిర్వహించారు.అధ్యక్షుడిగావిఠల్‌రావు, జనరల్ సెక్రెటరి డాక్టర్ పి.వి నర్సింహం, ఫైనాన్స్ సెక్రటరీగా సలావుద్దీన్, అసోసియేషన్ ప్రెసిడెంట్‌గా బాల్‌రెడ్డి, మిగత కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా జనరల్ సెక్రటరీ చంద్రశేఖర్ మాట్లాడుతూ ఈ నెల 7న జరిగే ధర్నా కార్యక్రమంలో ఎక్కువ శాతం పాల్గొని మనం సాధించవలసిన హెల్త్ కార్డులు, పీఆర్సీ, డీఏలు సాధించుటలకు రావాలని పిలుపునిచ్చారు.

వైన్స్‌ను మరో చోటికి తరలించాలి

రాజంపేట,నవంబరు 3(ఆంధ్రజ్యోతి): రాజంపేట మండల కేంద్రంలో ఉన్న వైన్స్‌ను మరోచోటికి తరలించాలని ఎక్సైజ్ సూపరిటెండేంట్ హనుమంత్‌రావుకు గ్రామస్తులు వినతి పత్రం అందించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల కేంద్రంలో ఉన్న వైన్స్ ద్వారా గ్రామస్తులతో పాటు ఇతర గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. వెంటనే తగిన విధంగా స్పందించాలని కోరారు.

మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ప్రారంభం

రాజంపేట,నవంబరు 3(ఆంధ్రజ్యోతి):రాజంపేట మండల కేంద్రంలోని సొసైటి ఆధ్వర్యంలో సోమవారం మొక్క జొన్న కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించినట్లు చైర్మన్ అశోక్ తెలిపారు. రైతులకు ఇబ్బంది లేకుండా ప్రభుత్వం మక్కలకుక్వింటాల్‌కు రూ.2400 చెల్లిస్తుందని తెలిపారు.దళారులను నమ్మి రైతులు మోసపోవద్దని తెలిపారు.ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్, డైరెక్టర్‌లు, ఏవో తదితరులు పాల్గొన్నారు.

వెల్లుట్లపేటలో ఉచిత ఆరోగ్య శిబిరం

ఎల్లారెడ్డి రూరల్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డి మండల పరిధిలోని వెల్లుట్లపేట గ్రామంలో సోమవారం ఉచిత ఆరోగ్యశిబిరాన్ని నిర్వహించారు. గ్రామ యువకుడు రాజాగౌడ్ చొరవతో హైదరాబాద్‌లోని మల్లారెడ్డి నారాయణ మల్టీస్పెషాలిటీ వైద్య బృందం ఆధ్వర్యంలో చేపట్టిన ఉచిత వైద్య శిబిరంలో స్థానికులకు బీపీ,షుగర్, జ్వరం, మోకాళ్ల నొప్పులు, దమ్ము, దగ్గు,తలనొప్పి, తదితర రోగాలకు సంబంధించి వైద్య బృందం సభ్యులు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు.ఈసందర్భంగా వైద్య సిబ్బంది మాట్లాడుతూ ప్రజలు ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలన్నారు. ఈ మేరకు రాజాగౌడ్‌కు గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు.ఈకార్యక్రమంలో వైద్య సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

చెట్లను నరికివేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

కామారెడ్డిటౌన్,నవంబరు 3(ఆంధ్రజ్యోతి): చెట్లను నరికివేసిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని డీ ఎఫ్‌ఓ నిఖితకు,పట్టణ సీఐ నరహరికి బీఆర్ఎస్ నాయకులు వినతి పత్రం అందించారు.ఈ సందర్భంగా బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు జుక్కంటి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ అధికారులు రోడ్లపై ఉన్నటువంటి చెట్లను అనుమతులు లేకుండా తొలగిస్తున్న చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారని తెలిపారు. అశోక్‌నగర్ కాలనీలో ఇష్టరితిన చెట్లు నరికివేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నామన్నారు.ఈ కార్యక్రమంలో నాయకులు కుంబాల రవియాదవ్, భాను, మాజిద్, శ్రీను, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

మా భూమిని అప్పగించండి

▸▸ భూమి కబ్జా కాకుండా చూడాలని అధికారులకు వేడుకోలు

దోమకొండ, నవంబరు 3(ఆంధ్రజ్యోతి):తమ భూమి కబ్జా కాకుండా చూడాలని అట్టి భూమి అధికారులు పరిశీలించి తమకు అప్పగించాలని కోరుతూ సోమవారం మండలంలోని అంబార్‌పేట గ్రామానికి చెందిన రంగోలు బాల్‌లక్ష్మి కోరారు. ఆమె కుటుంబ సభ్యులతో కలసి విలేకర్లతో మాట్లాడారు. సర్వే నెంబర్ 744/5లో తమకు ఒక ఎకరం 16 గుంటల భూమి ఉందన్నారు. గ్రామానికి చెందిన గౌడ కులస్తులు మూడు సంవత్సరాల క్రితం తమ భూమిలో అక్రమ నిర్మాణాలు చేయగా తాము గ్రామ పంచాయతీ కార్యదర్శికి, ఎంపీడీవోకు ఇతర మండల స్థాయి అధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. తాము కొన్ని సంవత్సరాలుగా హైదరాబాద్‌లో ఉంటున్నామన్నారు. జీపీ నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా భవనం నిర్మాణం పనులు చేపడుతున్నారని అట్టి భవనంకు పర్మిషన్ లేకుండా పనులు పూర్తి చేస్తున్న అధికారులు పట్టించుకోవడం లేదని వారు ఆరోపించారు. ఇందేంటని అడిగితే ఇబ్బందులు పెడుతున్నారనితెలిపారు. అధికారులు చొరవ తీసుకుని అంబార్‌పేట గ్రామంలో ఉన్నటువంటి తమకు చెందిన స్థలాన్ని పరిశీలించి తమకు న్యాయం చేయాలని కోరారు.

వరిధాన్యం కాంట ప్రారంభం

దోమకొండ, నవంబరు 3(ఆంధ్రజ్యోతి):మండలంలోని గొట్టిముక్కులత గ్రామంలో సోమవారం వరిధాన్యం కాంట పనులను ఎంపీడీవో ప్రవీణ్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యం తేమశాతం వచ్చేంత వరకు ఆరబెట్టాలని సూచించారు. సెంటర్ నిర్వహకులకు రైతులు సహకరించాలన్నారు. కార్యక్రమంలో లత,శిరీష నవీన్ కుమార్, రాజు, కాంగ్రెస్ నాయకులు, పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనుల ప్రారంభం

దోమకొండ, నవంబరు 3(ఆంధ్రజ్యోతి):మండలంలోని గొట్టిముక్కుల గ్రామంలో సోమవారం ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో సీసీ రోడ్డు పనులను ప్రారంభించినట్లు ఎంపీడీవో ప్రవీణ్ కుమార్ తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విండో గోదాం ఆవరణతో పాటు అంగన్‌వాడి సెంటర్, గోదాం పక్కన ఉన్నటువంటి గ్రామానికి చెందిన మరో భవనం ముందు సీసీ పనులు పూర్తి చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

సమాఖ్య కార్యవర్గ సభ్యులకు శిక్షణ

దోమకొండ, నవంబరు 3(ఆంధ్రజ్యోతి):మండల సమాఖ్య కార్యవర్గ సభ్యులకు సోమవారం అధ్యక్షురాలు భూలక్ష్మి అధ్యక్షతన నిర్వహించారు. రెండు రోజుల శిక్షణ కార్యక్రమంలో కరీంనగర్ జిల్లా నుంచి వచ్చిన సీనియర్ సీఆర్పీలు పుష్ప మాట్లాడుతూ మాట్లాడుతూ మహిళా సంఘాలు వాటి విధులు బాధ్యతలువివిధ అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏపీఎం శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

సీఎం క్షమాపణ చెప్పాలి

▸▸ ఆపరేషన్ సిందూర్‌పై సీఎం వ్యాఖ్యలు సిగ్గుచేటు: బీజేపీ నాయకులు



రేవంత్‌రెడ్డి చిత్రపటాన్ని దహనం చేస్తున్న నాయకులు



దోమకొండలో సీఎం దిష్టిబొమ్మను దహనం చేస్తున్న దృశ్యం

కామారెడ్డి టౌన్, నవంబరు3 (ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సిందూర్‌పై సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు సిగ్గుచేటని, తక్షణమే క్షమాపణ చెప్పాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. రాజంపేట మండలకేంద్రంలో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను బీజేపీ నాయకులు సోమవారం దహనం చేశారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు సంపద్‌రెడ్డి మాట్లాడుతూ మాట్లాడుతూ జూబ్లిహిల్ ఎన్నికల ప్రచారంలో ఆపరేషన్ సిందూర్‌పై సీఎం రేవంత్‌రెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటని అన్నారు. ఒక వర్గం ఓట్ల కోసం దేశప్రజల మనోభావాలను దెబ్బతీస్తు సైనికులపై అనుచిత వ్యాఖ్యలు చేయడం సమాంజసం కాదని అన్నారు. జూబ్లిహిల్స్ ఉపఎన్నికల్లో ఓటమిభయంతోనే బీజేపీపై, కేంద్రమంత్రులపై ఇష్టం వచ్చినట్లు వ్యాఖ్యలు చేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో నాయకులు పిట్లశ్రీను, గ్రామ అధ్యక్షుడు సాయిరెడ్డి, రాము,రాజిరెడ్డి, కుమ్మరి రమేష్, నరేష్,రాజిరెడ్డి, బల్లకిషోర్, సంతోష్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

దోమకొండ: జూబ్లీహిల్స్ ఎన్నికల ప్రచారంలో సీఎం రేవంత్‌రెడ్డి ఆపరేషన్ సిందూర్‌పై చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా బీజేవైఎం ఆధ్వర్యంలో సోమవారం పాత బస్టాండ్ వద్ద సీఎం దిష్టిబొమ్మ దహనం చేశారు. అలాంటి మాటలు మాట్లడటం పద్దతి కాదన్నారు. కార్యక్రమంలో బీజేవైఎం మండలాధ్యక్షుడు మనోజ్ కుమార్, బీజేపీ మండలాధ్యక్షుడు భూపాల్‌రెడ్డి, మాజీ అధ్యక్షుడు చింతల రాజేష్, నరేందర్‌రెడ్డి, రవి, రవీందర్ రెడ్డి, విఠల్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, నత్తి గణేష్ తదితరులు పాల్గొన్నారు.



పాల్వంచలో సీఎం దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీజేపీ నాయకులు

ముఖ్యమంత్రి క్షమాపణ చెప్పాలి

పాల్వంచ: ఆపరేషన్ సిందూర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన సీఎం రేవంత్‌రెడ్డి వెంటనే క్షమాపణలు చెప్పాలని బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షులు తోట బాల్‌రాజు, బీజేపీ మండల అధ్యక్షుడు పోసు అనీల్ డిమాండ్ చేశారు. సోమవారం పాల్వంచ మండలకేంద్రంలో బీజేపీ మండలశాఖ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ దేశ రక్షణ కోసం నిరంతరం పాటుపడుతున్న సైనికుల పట్ల ఇలా వ్యవహించడం సిగ్గుచేటని విమర్శించారు. కార్యక్రమంలో బీజేవైఎం అధ్యక్షులు సత్యం, జిల్లా కార్యదర్శి నర్సింహాచారీ, రాజేందర్, సంతోష్, బాలయ్య, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

భిక్కనూరులో బీజేపీ నాయకుల ధర్నా

భిక్కనూరు: జూబ్లీహిల్స్ ఎన్నికల ప్రచారంలో భాగంగా సీఎం రేవంత్‌రెడ్డి ఆపరేషన్ సిందూర్‌పై చేసిన వాఖ్యలను నిరసిస్తూ భిక్కనూరు మండలకేంద్రంలో బీజేపీ నాయకులు మండల కేంద్రంలో పాత సినిమాటాకీసు చౌరస్తాలో ధర్నా చేశారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు ఉప్పరి రమేష్ మాట్లాడుతూ ఆపరేషన్ సిందూర్‌పై చేసిన వాఖ్యలను సీఎం వెనక్కి తీసుకుని జవాన్లకు, దేశ ప్రజలకు బహిరంగ క్షమాపణలు చెప్పాలన్నారు. అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో నాయకులు తిరుమలేష్, రంజిత్, నరేందర్‌రెడ్డి, యాదగిరి గౌడ్, రవీందర్‌రెడ్డి ఉన్నారు.

మాచారెడ్డి: ఆపరేషన్ సిందూర్‌పై చేసిన వాఖ్యలను నిరసిస్తూ మాచారెడ్డి మండలకేంద్రంలో గజ్యానాయక్ తాండా వద్ద బీజేపీ మండల శాఖ ఆధ్వర్యంలో నాయకులు సోమవారం ఆయన దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు బుస సురేష్ మాట్లాడారు. దేశప్రజలకు, సైనికులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్టీ మోర్చా అధ్యక్షుడు నరేష్, బీజేవైఎం మండల అధ్యక్షులు కళ్యాణ్, నరేష్, రవి, చలపతి, శ్రీధర్, ఎల్లం, అనీల్, స్వామిగౌడ్, చంద్రాగౌడ్ పాల్గొన్నారు.

పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

కామారెడ్డిరూరల్, నవంబరు3 (ఆంధ్రజ్యోతి):రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్ షిపులను వెంటనే విడుదల చేయాలని భారతీయ విద్యార్థి మోర్చ రాష్ట్ర కార్యదర్శి విఠల్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు అందించాల్సిన స్కాలర్ షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను సంవత్సరాల తరబడి విడుదల చేయకపోవడం వల్ల వెలాది మంది విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రైవేటు కళాశాలల్లో చదువుతున్న పేద, మధ్య తరగతి విద్యార్థులు కళాశాలలకు ఫీజులు చెల్లించమని ఒత్తిడి ఎదుర్కొంటున్నారన్నారు. కొన్ని ప్రైవేటు విద్యాసంస్థలు ఫీజు రియంబర్స్‌మెంట్ పైననే ఆధారపడి నడుపుతున్నారని తెలిపారు. ప్రైవేటు కళాశాలలు నిర్వహిస్తున్న బంద్‌కు సంపూర్ణ మద్దతు తెలియజేస్తామని తెలిపారు.

బీసీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో

జిల్లా కేంద్రంలోని సోమవారం నిర్వహించిన సమావేశంలో జిల్లా అధ్యక్షుడు నీల నాగరాజు మాట్లాడుతూ ఫీజు రీయంబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయకపోవడం వల్ల కళాశాలల యాజమాన్యాలు నిరవదిక బంద్‌ని పాటించడం శోచనీయమన్నారు. ప్రభుత్వం కళాశాలల యాజమాన్యాలతో చర్చలు జరిపి సమస్యను పరిష్కరించాలని బంద్‌ని నిలిపివేసి తరగతులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ బంద్ వల్ల బడుగు, బలహిన వర్గాల విద్యార్థులే ఎక్కువ నష్టపోయే ప్రమాదం ఉందని తెలిపారు. వెంటనే ప్రభుత్వం కళాశాలల యాజమాన్యాలతో సామరస్యంగా చర్చలు జరిపి సమస్యని పరిష్కరించాలని కోరారు. ఈకార్యక్రమంలో పవన్, రవికాంత్, రాజేందర్, సచిన్, శ్రీధర్, రక్షిత్, మోహన్, వినోద్, రాజు, బాను తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌టీఓ శ్రీనివాస్‌రెడ్డి సేవలు మరువలేనివి



ఆర్‌టీఓ శ్రీనివాస్‌రెడ్డిని సన్మానిస్తున్న అధికారులు

కామారెడ్డిటౌన్,నవంబరు 3(ఆంధ్రజ్యోతి):స్వచ్ఛంద ఉద్యోగ విరమణ పొందుతున్న ఆర్‌టీఓ శ్రీనివాస్‌రెడ్డి సేవలు మరువలేనివని అదనపు కలెక్టర్ విక్టర్, టీజీవో జిల్లా అధ్యక్షుడు దేవేందర్ అన్నారు. సోమవారం కామారెడ్డి కలెక్టరేట్‌లో ఉద్యోగ విరమణ పొందిన ఆర్‌టీఓ శ్రీనివాస్‌రెడ్డిని సన్మానించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రవాణాశాఖలో దాదాపు 32 సంవత్సరాలు పనిచేసి ఒక మెమో కూడా తీసుకోకుండా పనిచేసిన వ్యక్తి శ్రీనివాస్‌రెడ్డి అని అన్నారు. టీజీవో సంఘంలో ఉద్యోగుల సమస్యల పట్ల అనేక ఇబ్బందులు ఎదురైన సాధనకు కృషిచేసే వ్యక్తి అనితెలిపారు.అనంతరం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ తన ఉద్యోగానికి మరి కొన్నినెలల సమయం ఉన్న దాదాపు 92 సంవత్సరాల వయస్సు ఉన్న తన తల్లి ఆలన చూసుకునేందుకు స్వచ్ఛంద విరమణ పొందాల్సి వచ్చిందని తెలిపారు. జిల్లాలోని అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తు విశిష్ట సేవలు అందించడం, పలు సందర్భాలలో తమశాఖతో కలిసి పనిచేయడం సంతోషకరమని తెలిపారు. ఒక వైపు ఉద్యోగ విరమణ చేయడం బాధగా ఉన్న తన తల్లికి సేవలు చేసే భాగ్యం కలగడం సంతోషంగా ఉందని తెలిపారు.ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో చందర్‌నాయక్,ఏవో అహ్మద్, టీజీవో సంఘనాయకులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

తాడ్వాయి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కన్కల్ గ్రామంలో మాజీ మంత్రి మల్లారెడ్డి నారాయణ హాస్పిటల్ ఆధ్వర్యంలో సోమవారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించినట్లు మండల మాజీ బిఆర్ఎస్ అధ్యక్షులు పులగం సాయి రెడ్డి తెలిపారు. ఈ వైద్య శిబిరంలో వృద్ధులకు వివిధరకాల వైద్య పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేసినట్లు ఈయన అన్నారు. ఇందులో గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

గ్రామాల్లో ఎంపీడీవో పర్యటన


▸▸ ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలపై ఆరా



లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎంపీడీవో తాహెరా బేగం.

ఎల్లారెడ్డి రూరల్, నవంబరు 03(ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డి మండల పరిధిలోని రత్నాపూర్,కళ్యాణి. సోమర్యగడి తాండా గ్రామాల్లో సోమవారం ఎల్లారెడ్డి ఎంపీడీవో తాహెరాబేగం పర్యటించారు. ఆయాగ్రామాల్లో చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలతో ను పరిశీలించి ఇందిరమ్మ ఇండ్లు మంజూరై ఇప్పటివరకు నిర్మానాలు చేపట్టకపోవడంపై లబ్దిదారులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ఇల్లు లేని నిరుపేదలకు ప్రభుత్వం ఇల్లు అందించాలన్న లక్ష్యంగా ఈ పథకానికి శ్రీకారం చుట్టిందన్నారు. అర్హులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. లబ్దిదారులు సకాలంలో నిర్మాణాలను చేపట్టుకునే విధంగా అధికారులు ప్రోత్రహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో ప్రకాష్, కార్యదర్శి సుధారాణి, కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు సంజీవులు, ఏతఃసందీప్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

టీఎన్‌జీవోస్ సభ్యత్వ నమోదు



సభ్యత్వ నమోదుచేస్తున్న దృశ్యం

కామారెడ్డిటౌన్,నవంబరు3 (ఆంధ్రజ్యోతి):కామారెడ్డి జిల్లా వ్యవసాయశాఖ కార్యాలయంలో సోమవారం టీఎన్‌జీవోస్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టినట్లు జిల్లా అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి తెలిపారు.80 సంవత్సరాల చరిత్ర కలిగిన టీఎన్‌జీవోస్ ఉద్యోగుల సమస్యల పట్ల చిత్తశుద్దితో పనిచేస్తుందని తెలిపారు. భవిష్యత్తులో కూడా ఉద్యోగుల సమస్యలపై పోరాడేందుకు సిద్దంగా ఉందని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధానకార్యదర్శి ముల్కనాగరాజు, కేంద్రసభ్యుడు శివకుమార్, సహఅధ్యక్షుడు చక్రధర్, కోశధికారి దేవరాజు, జిల్లా ఉపాధ్యాక్షులు రాజేశ్వర్, ఆర్గనైజింగ్ సెక్రటరీ సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

2వ వార్డులో నిలిచిపోయిన పనులు పున:ప్రారంభం



పనులను ప్రారంభిస్తున్న నాయకులు

ఎల్లారెడ్డి రూరల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డి పురపాలక సంఘం పరిధిలోని 2వ వార్డులో గతకొంతకాలంగా నిలిచిపోయిన అభి వృద్ధి పనులు ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు చొరవతో సోమవారం ప్రారంభించినట్లు కాంగ్రెస్ పార్టీ నా యకులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతకొంతకాలంగా అర్ధంతరంగా నిలిచిపోయిన అభివృద్ధి పనులను ఇటీవల స్థానిక ఎమ్మె ల్యే దృష్టికి తీసుకెళ్లగా వెంటనే స్పందించిన ఎమ్మెల్యే అధికారులకు, కాంట్రాక్టర్లకు వెంట నే పనులను ప్రారంభించాలని ఆదేశించారు. ఎమ్మెల్యే చొరవతో వెంటనే పనులుప్రారంభం అయినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాం గ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కురుమ సాయిబాబా, ఇంతీయాజ్, విద్యాసాగర్, పాషా, తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

కామారెడ్డి

ప్రియ 70- కొత్తలోక
ప్రియ 35- లిటిల్ హార్ట్స్
దర్శన్- మిరాయి

బాన్సువాడ

మహేశ్వరి - బ్రహ్మాండ
వెంకటేశ్వర - కూలీ

చికెన్ ధరలు

రకం	సుగుణ	వెన్‌కాబ్
లైవ్	రూ.140	రూ.170
స్కిన్	రూ.200	రూ.210
స్కిన్‌లెస్	రూ. 220	రూ.230

భయంభయంగా.. బస్సు ప్రయాణం

(5వ పేజీ తరువాయి)

మెదక్, సిద్దిపేట్, కరీంనగర్, వరంగల్, ఆదిలాబాద్, నిర్మల్ తదితర జిల్లాలకు వస్తుపోతుంటాయి. ప్రతీరోజు 87,649 కిలో మీటర్లు ప్రయాణిస్తుంటాయని ఆర్టీసీ అధికారులు చెబుతున్నారు. ఆర్టీసి సంస్థలో సుమారు 600 మంది డ్రైవర్లు, కండక్టర్లు, ఇతర ఉద్యోగులు ఉన్నారు.

కాలం చెల్లిన బస్సులతోనూ..

ఆర్టీసీలో అద్దె బస్సులను ఎక్కువగా వినియోగిస్తున్నారు. కొత్తబస్సులను కొనుగోలు చేయడం లేదు. పెరుగుతున్నప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా బస్సులు లేకపోవడంతో కాలం చెల్లిన బస్సులనే వినియోగిస్తున్నారనే వాదన ప్రయాణికుల నుంచి వినిపిస్తుంది. ఈ బస్సులు మరి అధ్వానంగా ఉంటున్నాయి. పైన చూడడానికి అందగా ఉండే విధంగా రంగులు వేసి రోడ్డెక్కిస్తున్నారు. రెండు డి పోల పరిధిలోని చాలా బస్సులు అధ్వానంగా మారినట్లు తెలుస్తోంది. రోడ్డు ఎక్కిన బస్సు గమ్య స్థానాలకు చేరేంత వరకు కూడా నమ్మకం లేని పరిస్థితి బ్రేకులు ఫేల్ కావడం, స్టీరింగ్ పనిచేయకపోవడం, కిటికిలు లేకపోవడం, డోర్లు సరిగా పడకపోవడం వంటి సమస్యలతో బస్సులు నడుస్తున్నాయి. ఏదైనా ఘటనలు జరిగినప్పుడు హడావిడి చేస్తున్న అధికారులు ఆ తర్వాత పట్టించుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి.

జిల్లాలో గతంలో చోటుచేసుకున్న ఘటనలు

జిల్లాలో 12 వరకు ఆర్టీసీ ప్రమాదాలు చోటుచేసుకోగా 8 మంది మృతిచెందినట్లు ఆర్టీసీ రికార్డులు చెబుతున్నాయి. గతంలో రాజంపేట మండలం పెద్దాయిపల్లి గేట్ వద్ద ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో తాత,మనుముడు బస్సు చక్రాల కింద పడి అక్కడికక్కడే మృతిచెందారు. కామారెడ్డి డిపో పరిధిలోని ఓ ప్రాంతంలో ఆర్టీసీ కండెక్టర్ నిర్లక్ష్యం కారణంగా ఓ ప్రయాణికుడు బస్సు టైర్ల కింద పడి మృతిచెందాడు. ఈ ఘటనలో కండెక్టర్‌ను ఆర్టీసీ అధికారులు సస్పెండ్‌చేశారు. గత 11నెలల కిందట మాచారెడ్డి మండలంలోని బస్టాండ్‌లో విద్యుత్ స్తంభాన్ని బస్సు ఢీకొనడంతో స్తంభం నెలకొరిగింది. ఆ సమయంలో విద్యుత్ ప్రవాహం ఉండగా బస్సుకు కొద్దిదూరంలో స్తంభం పడిపోయింది. ఆ సమయంలో ఏ మాత్రం బస్సుపై స్తంభం పడిన భారి ప్రమాదం చోటు చేసుకునేది. ఇలా గతంలోను మాచారెడ్డి మండలం ఘన్‌పూర్ శివారులో జరిగిన ఆర్టీసీ బస్సు, కారు ఢీకొన్న ఘటనలో డ్రైవర్‌నిర్లక్ష్యం ఉన్నట్లు పోలీసులు కేసు నమోదుచేశారు. ఈబస్సులు హైయర్ బస్సు డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగా ఐదుగురు ప్రాణాలు కోల్పోవాల్సి వచ్చింది. ఇలా జిల్లాలో ఆర్టీసీ బస్సుల నిర్లక్ష్యం కారణంగా ఎన్నో ప్రమాదాలు చోటు చేసుకుంటునే ఉన్నాయి.

సంబురంగా ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశం

(5వ పేజీ తరువాయి)

వెనుకబడి ఉందని తాను ఎమ్మెల్యేగా గెలిచి నియోజకవర్గానికి రూ.100 కోట్లు మంజూరు చేయించి పలు అభివృద్ధి పనులు చేశానని ఆయన తెలిపారు. లింగంపేట మండలం మోతె శివారులో రూ.200కోట్లతో ఇంటర్నేషనల్ రెసిడెన్షియల్ స్కూల్‌ను నిర్మించనున్నట్లు చెప్పారు.

జ్యోతిబాపూలే గురుకుల పాఠశాల పనితీరుపై అసంతృప్తి

మండలకేంద్రంలో నిర్వహిస్తున్న తాడ్వాయి మండలానికి చెందిన జ్యోతిబాపూలే గురుకుల పాఠశాల మధ్యాహ్న భోజనం, ఉపాధ్యాయుల పనితీరు పై ఎమ్మెల్యే మదన్‌మోహన్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన పాఠశాలను ఆకస్మికంగా తనిఖీచేశారు. మధ్యాహ్నం పాఠశాలలో భోజనంచేస్తున్న విద్యార్థుల భోజనాన్ని పరిశీలించి విద్యార్థులను అడుగగా భోజనం బాగులేదని చెప్పారు. దీంతో ఆయన వెంటనే బియ్యం సప్లయిచేస్తున్న పాయింట్‌కు ఫోన్ చేసి మంచి నాణ్యత కలిగిన బియ్యం పంపిణీ చేయాలని ఆదేశించారు. ఉపాధ్యాయుల హాజరు రిజిస్టర్‌ను పరిశీలించి రిజిస్టర్‌లో హాజరు ఉండి పాఠశాలలో లేని ఉపాధ్యాయుని గురించి ప్రశ్నించారు. పాఠశాల పనులపై ఎంఈవో కార్యాలయానికి వెళ్లినట్లు చెప్పగా తాడ్వాయి ఎంఈవో రామస్వామిని అడిగి తెలుసుకున్నారు.

రైతులు పండించి ప్రతీ ధాన్యం గింజను కొనుగోలు చేస్తాం

భారీవర్షాలకు తడిసిన ధాన్యంతో ఇబ్బందులు పడుతున్నామని రైతులు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. వ్యవసాయ శాఖ మంత్రితో మాట్లాడి ఎల్లారెడ్డి నియోజకవర్గంలో రైతులు పండించిన ప్రభుత్వం ధాన్యం పూర్తిగా వెంటనే కొనుగోలు చేయాలని కోరతానని హామీఇచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నారాగౌడ్, మాజీజెడ్పీటీసీ సంతోష్‌రెడ్డి, గోకుల్ సాయిరాం, అబ్దుల్ వాహబ్, అట్టెం శ్రీను, గుండ బాలకిషన్, కౌడ రవి, అశోక్, పీఎంపీ ఆర్‌ఎంపీల జిల్లా అధ్యక్షుడు నిజ్జన విఠల్‌లతో తదితరులు ఉన్నారు.

గుంపులుగా కోతులు ప్రజలకు వెతలు

(5వ పేజీ తరువాయి)

చేస్తున్నారు. దీంతో పురప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వాటిని తరిమి కొట్టేందుకు నానా అవస్థలు పడుతున్నారు. మరి కొందరు కోతుల దాడిలో గాయలపాలవుతున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు వానరులు పట్టణంలో అన్ని వార్డుల్లో గుంపులు గుంపులుగా వందల సంఖ్యలో ఇళ్లపై దాడికి దిగుతున్నాయి. చిన్నారులు, మహిళలు వాటిని చూసి భయభ్రాంతులకు గురవుతున్నారు. కర్రలతో వాటిని తరమడం, టపాకాయలు పెల్చిన పలితం లభించడంలేదని ప్రజలు వాపోతున్నారు. తరిమి కొట్టగానే మళ్లీ తిరిగి గుంపులుగా వస్తున్నాయని ప్రజలు తెలుపుతున్నారు. బయట రోడ్లపై వస్తువులు పట్టుకుంటే చాలు, అలాగే కురగాయాలు, తినే వస్తువులు కనబడితే చాలు అవి దాడికి దిగుతున్నాయని తెలుపుతున్నారు. కొందరి ఇళ్లపై కోతులు సంచరించడంతో ఇళ్లపై పెంకులు, రేకులు ధ్వంసం అవుతున్నాయని చెప్తున్నారు. అధికారులకు అధికారులు స్పందించి కోతుల బెడద నుంచి తమకు కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

ఆలయంలో కార్తీక మాస ప్రత్యేక పూజలు

భిక్కనూరు, నవంబరు3(ఆంధ్రజ్యోతి): దక్షిణకాశీగా బాసిల్లుతున్న మండలకేంద్రంలోని శ్రీ సిద్ధరామేశ్వర ఆలయంలో కార్తీక మాస ప్రత్యేక పూజలు కొనసాగుతున్నాయి. కార్తీకమాస రెండవ సోమవారం సందర్భంగా స్వామివారిని ఆలయ అర్చకులు స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాల వితరణ చేశారు. ఉదయం నుండే జిల్లా నలుమూలల నుండి భక్తులు అధికసంఖ్యలో ఆలయానికి చేరుకుని స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయప్రాంగణంలో అభిషేకాలు నిర్వహించి కార్తీక దీపాలను వెలిగించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ లింబాద్రి, ఈవో శ్రీధర్, అర్చకులు రామగిరి శర్మ, సిద్ధగిరిశర్మ, సిద్దేశ్, రాజేశ్వరశర్మ, ఆలయ డైరెక్టర్లు, భక్తులు పాల్గొన్నారు.

వీరభద్ర స్వామి ఆలయంలో..

ఎల్లారెడ్డిరూరల్: ఎల్లారెడ్డి మండల పరిధిలోని మీసన్‌పల్లి గ్రామంలో గల వీరభద్రస్వామి ఆలయంలో సోమవారం కార్తీకమాస ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. స్థానిక మహిళలు కార్తీకమాసం సందర్భంగా ఆలయంలో పిండ దీపాలను పెట్టి మొక్కులు తీర్చుకున్నారు. భగవంతుని దివెనలతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ పూజారీ శేఖరప్ప, గ్రామస్థులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో పలువురి చేరిక

భిక్కనూరు, నవంబరు3(ఆంధ్రజ్యోతి): మండలంలోని కంచర్ల గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు పెంజర్ల లక్ష్మారెడ్డితో పాటుగా పలువురు కాంగ్రెస్ పార్టీని వీడి సోమవారం మాజీ ఎమ్మెల్యే గంపగోవర్దన్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ అభివృద్ధి కేవలం బీఆర్ఎస్, కేసీఆర్‌తోనే సాధ్యమని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రజలకు చేస్తున్న నమ్మకద్రోహంతో విసుగుచెందిన కాంగ్రెస్ పార్టీ నుంచి నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున బీఆర్ఎస్‌లోకి చేరుతున్నారని అన్నారు. ఈమేరకు వారికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో నాయకులు పొగాకు బాపురెడ్డి, మట్టే మహిపాల్‌రెడ్డి, సత్యగౌడ్, మెరుగు రవి, తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రి నిర్మాణం కోసం స్థల పరిశీలన

ఎల్లారెడ్డిరూరల్, నవంబరు3 (ఆంధ్రజ్యోతి): భిక్కనూరు గ్రామంలో పల్లె దవాఖానా భవన నిర్మాణం ఏర్పాటు కోసం అవసరమైన స్థలాన్ని సోమవారం ఆర్డీవో పార్థసింహారెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థల ఎంపిక పూర్తి చేసి వెంటనే పల్లె దవాఖాన భవన నిర్మాణ పనులను ప్రారంభిస్తామన్నారు. పల్లె దవాఖానా ఏర్పాటుతో స్థానికంగా గ్రామస్థులకు వైద్యసేవలు అందుబాటులోకి వస్తాయన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి స్వప్న, కారోబర్ రాజు, ఈజీఎస్ ఎఫ్ఏ బాగయ్య, ఆరోగ్యశాఖ అధికారులు, గ్రామస్థులు పాల్గొన్నారు.